# ఆర్గాన్ న్యూస్

VOICE OF DEMOCRACY

తెలుగు దినపత్రిక

సంపుటి :18 సంచిక :175 ఖమ్మం, తెలంగాణ ఆదివారం 26.07.2026 పేజీలు :12, వెల : 2/-

Circulating to : Hyderabad, Khammam, Warangal, Nalgonda, Karimnagar, Adilabad, Medak and Mahabubnagar



WE ARE HIRING

ఆర్గాన్ NEWS

విలేఖరులు కావలెను

జిల్లాస్థాయి రిపోర్టర్లు.. ఫ్రీలాన్స్ జర్నలిస్టులు కావలెను

2009లో సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో ప్రారంభమై దిగ్విజయంగా నడుస్తూ.. ప్రజాధరణ పొందిన ఆర్గాన్ న్యూస్ ఇప్పుడు వెబ్ ఛానల్ ద్వారా 24 గంటలు నిరంతర వార్తా ప్రసారాలతో ప్రపంచ వ్యాప్తంగా రాబోతుంది.. ఉమ్మడి రాష్ట్రాలలోని అన్ని జిల్లాల్లోని నియోజకవర్గ రిపోర్టర్‌గా పని చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాము..

కావలసిన ప్రాంతాలు:

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రజాస్వామ్యపు విలువలు కలిగి ప్రజల గొంతుకగా నిలిచే వార్తలు అందించగలిగే నైపుణ్యం గలవారు మాత్రమే మాతో కలిసి నడవండి..

SEND RESUME : organ.today@gmail.com 9849896178






# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

ఫలించిన 'కాక్రోచ్' పోరాటం

## ఆందోళన విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ

### మరో రెండు కీలక డిమాండ్లకూ కేంద్రం అంగీకారం

### బాధిత విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం

### నిరసనకారులపై కేసులు ఎత్తివేస్తామన్న జేపీ నడ్డా

**సీజేపీ పోరాటంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదు. గత పది రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాల పట్ల కలత చెందానని ఆయన చెప్పారు. యువత ఆకాంక్షలను గౌరవిస్తున్నానని స్పష్టంచేశారు. ఇప్పటి పరిస్థితిని దేశ విద్రోహ శక్తులు అనుకూలంగా మార్చుకోవడానికి అవకాశం ఇవ్వొద్దన్న కారణంతోనే పదవి నుంచి తప్పుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు యువతకు ప్రధాన్ లేఖ రాశారు. ఢిల్లీలో పరిణామాలు శనివారం చకచకా జరిగిపోయాయి.**

న్యూఢిల్లీ, జూలై 25 : ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఆయన స్థానంలో కేంద్ర మంత్రి ప్రల్హాద్ జోషీకి విద్యా శాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. మరోవైపు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్, సీజేపీ ప్రతినిధులు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ మధ్య మూడో విడత చర్చలు జరిగాయి. సీజేపీ లేవనెత్తిన మరో రెండు కీలక డిమాండ్ల పట్ల కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారు. పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని, నిరసనకారులపై




## ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అప్పగింత

ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం



## ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

గాంధీ నుంచే తాముశాంతిని నేర్చుకున్నాం

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే


02




## చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

### అప్పుడే యువతకు రాజకీయ అవకాశాలు వస్తాయి

### తెలంగాణ అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేస్తాం

### కాంగ్రెస్ కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్

**చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అప్పడే నీతిమంతమైన రాజకీయాలు సాగుతాయని అన్నారు. దేశంలో అధికారంలో వారు భాగస్వాములు కావాల్సి ఉందన్నారు. నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా దిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు.**

హైదరాబాద్,జూలై25 : కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు. దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని


-మిగతా 2 లో..


## విద్యార్థుల పోరాటానికి తలొగ్గిన మోడీ

### కేంద్రం దిగిరాక తప్పని పరిస్థితి : మంత్రి పొన్నం ప్రభాకర్

### కేంద్రం తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, జులై 25 : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ ఉద్యమానికి దక్కిన విజయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లపై కేంద్రం దిగివచ్చిందని, ఈ పరిణామం ప్రభుత్వాలకు ఒక కనువిప్పుగా మారాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి దక్కిన విజయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు కోసం దేశవ్యాప్తంగా వ్యక్తమైన ఆందోళనల ఫలితంగానే


-మిగతా 2 లో..




## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

### రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ వృద్ధి

**త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు**

**రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి**



హైదరాబాద్, జులై 25 : రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి


-మిగతా 2 లో..





## అధికారంలో ఉన్నవారి కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

### ధర్మేంద్ర రాజీనామాపై కెటిఆర్ పోస్ట్

యావత్ దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీజీపీ కాంక్రోచ్ జనతా పార్టీతోపాటు విద్యార్థుల ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం సీజేపీ నేతలను చర్చలకు కూడా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది. జెన్ జి ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు.


-మిగతా 2 లో..




## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 140 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 167 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 259 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹98

## నీట్ రద్దుతో విద్యార్థుల్లో పెరిగిన పట్టుదల

### మరింత మెరుగైన ప్రతిభ కోసం కష్టపడ్డారు

### ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్య

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్షల పేపర్ లీకేజీల వివాదంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భిన్నంగా స్పందించారు. పేపర్ లీక్‌లు జరిగినప్పుడు మొదట్లో విద్యార్థులు తీవ్రంగా బాధపడినప్పటికీ, ఆ తర్వాత ఆ సవాలును స్వీకరించి మరింత బాగా చదివి ప్రతిభను మెరుగుప రుచుకున్నారని ఆమె తెలిపారు. ముందు బాధనిపించింది.. తర్వాత దాన్నే అవకాశంగా మలచుకుని మెరుగ్గా రాశామని పలువురు విద్యార్థులు చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు.







## కోమటిరెడ్డి నాకు టిక్కెట్ ఇవ్వడడేంటి?

కాంగ్రెస్‌లో అధినమే టిక్కెట్ ఇస్తుంది

రాజగోపాల్‌రెడ్డికి మందల సామేల్ కౌంటర్

## ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

### డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సహించండి

### మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల సూచన

ఎల్-నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్-నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు.



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

## ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అప్పగింత

**ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం**



**న్యూఢిల్లీ, జూలై 25 :** ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం మరో మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ప్రస్తుతం కన్స్యూమర్ ఎఫైర్స్ శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు. కర్ణాటకలోని ధార్వాడ్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రహ్లాద్ జోషి.. ఆహార, ప్రజాసరఫరా వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖ వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తున్నారు. భారత్ చొరవతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌కు ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

## ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

**గాంధీ నుంచే తాముశాంతిని నేర్చుకున్నాం**

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే**



**న్యూఢిల్లీ, జూలై 25 :** నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

## విద్యార్థుల పోరాటానికి తలొగ్గిన మోడీ

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ఆయన అన్నారు. విద్యార్థుల ఆవేదనను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు గురైందని, చివరకు ప్రజల ఒత్తిడి ముందు తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదని, ప్రజల గొంతుకకు లభించిన గౌరవమని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ప్రభుత్వమైనా మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ రోజు దిగివచ్చిన ప్రభుత్వం రేపు గ్దదె దిగక తప్పదని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆకాంక్షలను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీయేతర రాజకీయ పక్షాల పోరాటానికి దక్కిన విజయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని, వాటి ఫలితంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకను ప్రభుత్వం గౌరవించక తప్పదని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తన పదవి కాపాడుకోవడానికే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శించారు. నీట్ పరీక్ష లీక్ జరిగినప్పుడే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉంటే పరిస్థితి ఇంత వరకూ వచ్చేదే కాదన్నారు. మూడు నెలల పాటు ఎందుకు తాత్సారం చేశారని ప్రశ్నించిన ఆయన.. విద్యార్థులపై పెరిగిన ఒత్తిడి, నిరసనల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. యువత తమ దమ్ము ఏంటో నిరూపించారని, వారి పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. భవిష్యత్తులో పేపర్ లీకులు జరగకుండా కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యార్థులు, యువత పోరాటానికి దక్కిన విజయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఈ పరిణామంతో బీజేపీ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యువతకు న్యాయం జరిగే వరకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరీక్షల నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కేంద్రాన్ని కోరారు. విద్యార్థుల డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. ఈ పరిణామం ప్రస్తుత ప్రభుత్వాలతో పాటు భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వాలకు కూడా ఒక కనువిప్పుగా మారాలని అన్నారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## ధర్మేంద్ర రాజీనామా.. యువత సాధించిన విజయం: హరీష్



**హైదరాబాద్,జులై 25 :** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో సీజీపీతోపాటు విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో వారి డిమాండ్ల మే-రకు ధర్మేంద్ర ప్రధాన్ తలొగ్గుతూ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజేపీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్పందించారు. తాజా సందర్భాన్ని దేశంలోని యువతకు ఇది ఒక గొప్ప విజయంగా హరీశ్ రావు అభివర్ణించారు.. సామాజిక దృక్పథంలో వస్తున్న మార్పు నిజంగానే కనిపిస్తోంది. విద్యార్థులందరికీ అభినందనలు.. అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ గొప్ప దేశంలోని విద్యార్థులు, యువత, 'జెన్-జెడ్' టీంకు అభినందనలు. ఈ విజయం మీదే. మీకు మా మద్దతును అందించినందుకు సంతోషంగా ఉంది.. అంటూ బీఆర్ఎస్ పార్టీ ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)



కేసులు కొట్టివే యాలని సీజేపీ డిమాండ్ చేయగా, ప్రభుత్వం అందుకు అంగీకారం తెలియజేసింది. మొత్తానికి మూడు కీలకమైన డిమాండ్లు నెరవేరడంతో కాక్రోచ్ జనతా పార్టీలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. శనివారం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత ఆ పార్టీ సంబరాల్లో మునిగిపోయింది. ఆశించిన లక్ష్యం నెరవేరడంతో.. 49 రోజులుగా సాగుతున్న పోరాటాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. నిరసన ప్రదేశాల నుంచి అందరూ శాంతియుతంగా వైదొలగాలని ఆ పార్టీ నేత సౌరవ్ దాస్ కోరారు. నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నడ్డా వెల్లడించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నిబంధనల మేరకు పరిహారం అందిస్తామని తెలిపారు. అయితే, ఎంత ఇస్తారన్నది ఆయన పేర్కొనలేదు. కేంద్ర మంత్రి రాజీనామా చేసిన సంగతి తెలియడంతో జంతర్‌మంతర్ వద్ద శనివారం పండుగ వాతావరణం నెలకొంది. నిరసనకారులు త్రివర్ణ పతాకాలు చేతబూని, కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. 'చక్ దే ఇండియా'వంటి పాటలు వినిపిస్తుండగా, వారు ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం కనిపించింది. చాలామంది డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాలను, పోస్టర్లను ప్రదర్శించారు. మంత్రి రాజీనామాను తమ పోరాటానికి దక్కిన విజయంగా అభివర్ణించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే జంతర్‌మంతర్ వద్ద జనాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. అనుకున్నది చేసి చూపించామని చెప్పారు. భయపడకపోతే గెలవవచ్చనడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామే నిదర్శనమని స్పష్టంచేశారు. సోనమ్ వాంగ్‌చుక్ సైతం స్పందించారు. ఇది ప్రజాస్వామ్య విజయమని పేర్కొన్నారు. శాంతి, సహనం, పట్టుదలకు దక్కిన విజయం అని తేల్చిచెప్పారు. సీజేపీకి, దేశంలోని జెన్ జెడ్‌కి అభినందనలు తెలియజేశారు. ప్రధాని మోదీ మొండితనం ఓడిపోయిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను 'విక్టరీ ఆఫ్ ట్రూత్'గా అభివర్ణించారు. "యువతకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి. లాఠీలు, పెల్లెట్ గన్‌లతో దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి"అని ఖర్గే డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళన.. ప్రభుత్వాన్ని ఎవరూ తమ సొంత జాగీరులా నడపలేమని బీజేపీ--ఆర్ఎస్ఎస్ పాలకవర్గానికి హెచ్చరిక జారీ చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకవేళ ప్రభుత్వాన్ని సొంత జాగీరుగా భావిస్తే ఇప్పుడు జరిగిన దానికంటే పది రెట్లు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అవినీతికి ప్రతీక అని అని మండిపడ్డారు. ఆయన వెళ్లిపోవడం మంచిదేనని చెప్పారు. ఆందోళన సమయంలో విద్యార్థులపై జరిగిన అకృత్యాలకు గాను ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. "ప్రజాస్వామ్యానికి ఇది గొప్ప విజయం, దేశ ప్రజలందరికీ అభినందనలు"అని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సోషల్ మీడియాలో పోస్టుచేశారు.

## చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

(మొదటిపేజీ తరువాయి)



స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు. విద్యార్థుల మొహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మోదీ చరిష్మా తగ్గిందని, ఆయన చర్యలను ప్రపంచం ఖండించిందని వ్యాఖ్యానించారు. జెన్ జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని మహేష్ గౌడ్ అన్నారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి వచ్చే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, ఈ మార్పును తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, జెన్ జీలు పాల్గొన్నారు.

## అధికారంలో ఉన్నవారి కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

**ధర్మేంద్ర రాజీనామాపై కెటిఆర్ పోస్ట్**




**హైదరాబాద్,జులై 25 :** యావత్ దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీజేపీ కాంక్రోచ్ జనతా పార్టీతోపాటు విద్యార్థుల ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజేపీ ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం సీజేపీ నేతలను చర్చలకు కూడా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది. జెన్ జి ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులు, య-ువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహానగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారని తెలిసిందే. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై భావోద్వేగంతో ప్రసంగించారు. 'పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు? ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?' అని కేంద్రాన్ని నిలదీశారు. ఢిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనస్సు చలించిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ, రేవంత్ ప్రభుత్వాలపై తనదైన శైలిలో పంచులు విసిరారు. ఢిల్లీలో యువతపై మోదీ సర్కార్ సాగిస్తున్న దమనకాండను కండ్లకుకట్టారు. రేవంత్ దాగుడు మూతలను ఎత్తిచూపారు. ఢిల్లీ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న యువకులపై ఉగ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్థాన్ నుంచి నిధులు వస్తున్నాయని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే ఉద్యమిస్తున్న విద్యార్థుల వద్దకెళ్లి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సి ఉండేదన్నారు.



## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఎ÷-లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15-20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2-3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా ఆషాఢ ఉత్సవాలు

**27, 28, 29 తేదీల్లో శాకంబరీ ఉత్సవాలకు సన్నాహాలు**

**విజయవాడ,జులై25 :** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఆషాడ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న శాకంబరీ ఉత్సవాలకు దేవస్థానం సన్నాహాలను ముమ్మరం చేసింది. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీ శాకంబరీదేవి అలంకారంలో ఆకు కూరలు, కూరగాయలు, పండ్లతో అలంకరించబడిన ప్రకృతి మాత స్వరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల తొలి రోజు అలంకరణ కోసం శ్రీ దుర్గా మల్లేశ్వర హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులు, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు బడేటి ధర్మారావు ఆధ్వర్యంలో తొలి విడతగా 7 టన్నుల కూరగాయలను దేవస్థానానికి అందజేశారు. శనివారం సాయంత్రం మహామండపం ఆరో అంతస్తులో దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ అమ్మవారికి కూరగాయలను సమర్పించగా, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాకంబరీ అలంకరణ కోసం కూరగాయల దండల తయారీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాడేపల్లిగూడెం, తణుకు, మడికి, సిద్ధాంతం, ఏలూరు ప్రాంతాలతో పాటు గుంటూరు జిల్లా జాగర్లమూడి, తెనాలి, యడ్లపల్లి, నారాకోడూరు, గుంటూరు, కృష్ణా జిల్లా నూజివీడు, చినఓగిరాల, పెదఓగిరాల ప్రాంతాల రైతుల నుంచి వివిధ రకాల కూరగాయలను సేకరించి దేవస్థానం బస్సుల ద్వారా ఇంద్రకీలాద్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది నిర్వహించే శాకంబరీ ఉత్సవాలు ఇంద్రకీలాద్రిలో అత్యంత వైభవంగా జరుగుతాయని, ఈ మూడు రోజుల పాటు వేలాది మంది భక్తులు అమ్మవారిని ప్రకృతి మాత స్వరూపంలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు.

# రాష్ట్రంలో ఎక్కడా మంచినీటి సమస్య రాకూడదు

**మిషన్ భగీరథ ద్వారా ముందస్తు చర్యలు తీసుకోవాలి**

**15 రోజులకోమారు స్వయంగా సమీక్ష చేపడతా**

**అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క**



**హైదరాబాద్, జులై 25 :** దేశవ్యాప్తంగా ఎల్ నీనో పరిస్థితులు నెలకొన్నాయని, ఆ ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై కూడా ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాబోయే వేసవి పరిస్థితులు , నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని మిషన్ భగీరథ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. రాబోయే వంద రోజుల పాటు రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, నీటి సరఫరాపై ప్రతి 15 రోజులకు ఒకసారి తాను స్వయంగా సమీక్ష నిర్వహిస్తానని స్పష్టం చేశారు. విధుల పట్ల అశ్రద్ధ లేదా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్ కూడా ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. గ్రామాల్లో ఎక్కడైనా అత్యవసరంగా తాగునీటి సమస్య తలెత్తితే 16వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించి ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్థానిక నీటి వనరులను మరింత మెరుగుపరచాలని, నిరుపయోగంగా ఉన్న బోర్వెల్స్‌కు వెంటనే మ-రమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలున్న గ్రామాలను గుర్తించి, వారం రోజుల్లోగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. మండలాల వారీగా అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలని, ఎక్కడా సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. ఏదైనా పైప్‌లైన్ లీకేజీలు లేదా రిపేర్ల కారణంగా ఒక రోజు నీటి సరఫరా నిలిచిపోతే, ఆ విషయాన్ని గ్రామస్తులకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. దీనివల్ల ప్రజలు ముందస్తుగా నీటిని నిల్వ చేసుకుని సిద్ధంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఎల్ నీనో తీవ్రత దృష్ట్యా మిషన్ భగీరథ ఇంజనీర్లు , అసిస్టెంట్ ఇంజనీర్లు మరింత జవాబుదారీతనంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మిషన్ భగీరథతో ఇంకా అనుసంధానం కాని ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో ఏఈలు స్వయంగా పర్యటించి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని సీతక్క ఆదేశించారు. ప్రతి మండలంలో ఏఈలు స్థానిక సర్పంచ్‌లతో సమావేశమై మంచినీటి సరఫరా తీరుపై సమీక్షించాలని చెప్పారు. గతంలో కూడా ఎల్ నీనో పరిస్థితులు ఉన్నప్పటికీ సమర్థవంతంగా పనిచేసి నీటి ఎద్దడి లేకుండా చూశామని, ఇప్పుడు కూడా అదే పట్టుదలతో పనిచేయాలని కోరారు. 'జలసిరి' కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ వర్షపు నీటిలోని ప్రతి బొట్టునూ ఒడిసిపడితే భవిష్యత్తులో ఇలాంటి తాగునీటి సమస్యలను శాశ్వతంగా అధిగమించవచ్చని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## ఇందిరమ్మ టవర్స్ కోసం హెల్ప్‌లైన్

**ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం**

**ప్రారంభించిన మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్,జులై 25 :** క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ గృహాల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కాల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో దరఖాస్తుదారులకు సమాచారం అందించనున్నారు. దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేస్తూ, ఆధార్ కార్డు ఒక్కటే సరిపోతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో ఇతర పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే, రూ.10 వేల ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ ను యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒకవేళ ప్లాట్ కేటాయించకపోతే అదే బ్యాంకు ఖాతాకు ఈ మొత్తం తిరిగి జమ చేయనున్నట్లు వెల్లడించారు. క్యూర్ పరిధిలో కనీసం 10 సంవత్సరాలు నివాసం ఉండాలని మంత్రి తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండాలన్నారు. ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తారని పేర్కొన్నారు. అలాగే క్యూర్ లేదా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఇప్పటికే సొంత ఇల్లు లేదా స్థలం ఉన్నవారు ఈ పథకానికి అర్హులు కాదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అర్హుల సంఖ్య అందుబాటులో ఉన్న ప్లాట్ల కంటే ఎక్కువగా ఉంటే లాటరీ విధానంలో కేటాయింపులు చేపడతారని తెలిపారు. ఇందిరమ్మ టవర్స్‌లో ప్లాట్ ధర రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉండగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని స్పష్టం చేశారు. మిగిలిన మొత్తంలో లబ్దిదారుడు తన వాటాగా రూ.6 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## ధర్మేంద్ర రాజీనామాపై వాంగ్‌చుక్ హర్షం

**న్యూఢిల్లీ,జులై 25 :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఇది పట్టుదలతో యువత సాధించిన విజయని పేర్కొన్నారు. జెన్-జీ, సీజేపీ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో శనివారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ఇది ప్రజాస్వామ్యం సాధించిన విజయం. ఇది శాంతి, ఓర్పు, నిరంతర పట్టుదలల విజయం. దేశంలోని సీజేపీ, జెన్ జీ యువతకు అభినందనలు. భయాన్ని వీడి దేశం నలుమూలల నుంచి పోరాటానికి కదలివచ్చిన పౌరులందరికీ ధన్యవాదాలు. ఇప్పటివరకు బాధ్యతాయుతమైన సమాధానం కోరాం. ఇకపై సంస్కరణల వైపు సాగుదాం' అని రాసుకొచ్చారు.

## యువ విజయంపై అభిజిత్ తల్లి అనితా దీప్కే భావోద్వేగం

**పుణె,జులై 25 :** యువత విజయంపై కాక్రోచ్ పార్టీ చీఫ్ అభిజిత్ దీప్కే తల్లి అనితా దీప్కే స్పందించారు. భావోద్వేగానికి గురయ్యారు. నా కొడుకు ఉద్యమం మొదలు పెట్టినప్పుడు చాలా భయపడ్డాను. అతనికేమైనా జరుతుందేమోని ఆందోళన చెందాను. అభిజిత్ ను పోలీసులు కొట్టినపుడు మరింత భయమేసింది.. దాదాపు నెల రోజుల ఉద్యమంలో మేం నిద్రపోని రాత్రులు ఎన్నో.. తిండి కూడా సహించేదు కాదు..ఏ క్షణంలో ఏం జరగుతుందోని భయంగుప్పిట్లో బతికామని అనితాదీప్కే మీడియాతో తన అనుభవాన్ని పంచుకున్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదు

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడి**

**అమరావతి,జులై 25 :** ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ(సర్) ప్రక్రియలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఓటర్ల వివరాలను ఆయన అధికారికంగా ప్రకటించారు. అత్యధికంగా 44,89,488 మంది ఓటర్లకు సరైన అడ్రస్ లేదని సీఈఓ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,22,174 మంది ఓటర్లు మరణించినట్లు వెల్లడించారు. అలాగే, 14,43,886 మంది ఓటర్లు మరో చోటుకు బదిలీ అయ్యారని, ఇతర ప్రాంతాల్లో కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య 7,37,216 గా ఉందన్నారు. ఆచూకీ లభించని ఓటర్ల సంఖ్య 7,77,885 గా తేలిందని సీఈఓ తెలిపారు. అలాగే ఇతర కేటగిరీల కింద మరో 8,327 మంది ఓటర్లు ఉన్నారని వివేక్ యాదవ్ వివరించారు. అర్హులైన వారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 30 వరకు సరైన డాక్యుమెంట్లను చూపించి, మరలా ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు సీఈఓ వివేక్ యాదవ్ ప్రకటించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం

**బిఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**

**న్యూఢిల్లీ,జులై 25 :** ప్రశ్నాపత్రం లీక్ కావడానికి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదుల విజయమని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ , ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కాక్రోచ్ సైన్యాన్ని చూసి దేశం గర్వపడుతున్నదని, విద్యార్థులు,యువత ఆగ్రహించి పోరుబాట పడితే,అది ఏ స్థాయిలో ఉంటుందో యావత్ ప్రపంచం మరోసారి చూసిందని పేర్కొన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా, బెదిరించినా, భయపెట్టినా, నిర్బంధాలు ప్రయోగించినా, లాఠీలెత్తినా, దేశద్రోహులు,సంఘ విద్రోహులు అని ముద్రవేసినా కూడా యువత వెనుకంజ వేయకుండా ఉద్యమించిందని అన్నారు. విద్యార్థుల పోరాటంలో న్యాయం ఉందని, ధర్మమైనదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు ధర్నాలో పాల్గొని సంఘీభావం ప్రకటించడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. విద్యార్థుల ధర్మమైన ఆగ్రహావేశాలకు పార్లమెంట్ గేట్లు కూడా మూసేయాల్సిన పరిస్థితి తలెత్తిందంటే వారి బలమెంతో పాలకులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎలాంటి పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా లీక్ కాకుండా చర్యలు తీసుకోవలసిందిగా పేర్కొన్నారు.

# ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

**డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సహించండి**

**మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల సూచన**



**హైదరాబాద్, జూలై 25 :** ఎల్-నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్-నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బీఎంఎస్, బీఓక్యూలను పూర్తి చేసి వెంటనే అనుమతుల కోసం పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనా అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దని మంత్రి తుమ్మల సూచించారు. డ్రిప్ వ్యవసాయ పద్ధతిలో తక్కువ నీరు, విద్యుత్ ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణకు మైక్రో ఇరిగేషన్ కీలకమని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్ సదుపాయాలను వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు హుకుం జారీ చేశారు. అవగాహన కార్యక్రమాల్లో ఆయా కంపెనీలు తప్పనిసరిగా పాల్గొనాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400 కోట్లు చెల్లించిందని ఈ సందర్భంగా వెల్లడించారు. కంపెనీల పనితీరుపై జిల్లాల వారీగా నిరంతర సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. సూక్ష్మ సాగునీటి విస్తరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.

## కోమటిరెడ్డి నాకు టిక్కెట్ ఇవ్వడడేంటి?

**కాంగ్రెస్‌లో అధిష్టానమే టిక్కెట్ ఇస్తుంది**

**రాజగోపాల్‌రెడ్డికి మందల సామేల్ కౌంటర్**



**సూర్యాపేట,జూలై25 :** తుంగతుర్తిలో తప్పుడు వ్యక్తిని తీసుకొచ్చి టికెట్ ఇప్పించానంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి చేసి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే మందుల సామెల్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్‌గోపాల్.. పార్టీ మారి కాంగ్రెస్‌లోకి వచ్చారని.. ఆయన కంటే ముందు తానే కాంగ్రెస్‌లోకి వచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఇచ్చేది అధిష్ఠానం మాత్రమే అని చెప్పుకొచ్చారు. 'నాకు రెడ్లు ఓటేశారు, రాజ్‌గోపాల్ రెడ్డికి మాదిగలు ఓటేశారు. రెడ్లు, దళితులతోనే రాజ్యం నడవదు. నాకు టిక్కెట్ ఇచ్చింది ఏఐసీసీ. రాజగోపాల్ రెడ్డి కాదు. నా నియోజకవర్గానికి వచ్చి రోడ్డును పరిశీలించిన కోమటిరెడ్డి.. నాతో ఒక్కమాట కూడా చెప్పలేదు. మునుగోడులో నా క్యాడర్ కూడా ఉంది. మునుగోడులో రాజ్‌గోపాల్‌ను గెలిపించినందుకు నా క్యాడర్ బాధపడుతోంది' అని ఎమ్మెల్యే మందుల సామెల్ వ్యాఖ్యానించారు.

## అబద్దాలతో ఆగమవుతున్న కడియం

- ఆనాడు కాళేశ్వరాన్ని పొగిడి.. ఇప్పుడు విమర్శలా
- దేవాదులకు అసలు వినాశకర్తవు నీవే
- మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

**జనగామ,జులై 25 :** ఆనాడు కాళేశ్వరం ప్రాజెక్టును ఇంజనీరింగ్ అద్భుతం, వరప్రదాయని, మానస పుత్రిక అని పొగిడిన కడియం శ్రీహరి, నేడు మాటమార్చి కాళేశ్వరం కాదని కూలేశ్వరం అనడం ఆయన నైజానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శించారు. దేవాదులకు కడియం సృష్టికర్త కాదని, వినాశక కర్త అని ధ్వజమెత్తారు. స్టేషన్ ఘనపూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత వారం రోజులుగా నియోజకవర్గంలో తిరుగుతూ కడియం శ్రీహరి అబద్దాలు మాట్లాడుతూ ఆగమాగం అవుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన మాటలన్నీ చిన్నపిల్లల చిలిపి చేష్టలు, కారుకూతల్లాగే ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణను ఎండబెడుతూ ఆంధ్రప్రదేశ్ కి నీటిని దోచిపెట్టేలా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం అంటే కేవలం మేడిగడ్డ మాత్రమే కాదని, 16 రిజర్వాయర్లకు నీరందించే కల్పతరువు అని స్పష్టం చేశారు. కేసీఆర్‌కు చెడ్డపేరు తేవడానికే కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని, ఇప్పుడు కేంద్రానికి లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులపైనా, రైతుల సమస్యలపైనా కనీస అవగాహన లేదని రాజయ్య దుయ్యబట్టారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన వల్ల కరువు వస్తే, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరి వల్ల కరువు వచ్చిందని వ్యాఖ్యానించారు. నకిలీ కాంగ్రెస్‌లోకి వెళ్లిన కడియం శ్రీహరి, ఎమ్మెల్యేగా ఉండి కూడా పంటలకు నీళ్లు ఇవ్వలేకపోతున్నానని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కడియం కేవలం కమిషన్లు వచ్చే పనులపైనే దృష్టి పెడతారని, కమిషన్లకు కక్కుర్తి పడి ప్రాజెక్టుల అంచనాలు పెంచిన చరిత్ర ఆయనదని తీవ్ర ఆరోపణలు చేశారు. నియోజకవర్గానికి ఎవరు ఎంత చేశారనే దానిపై బహిరంగ చర్చకు రావలసిందిగా కడియం శ్రీహరికి రాజయ్య సవాల్ విసిరారు. నేను చేసిన అభివృద్ధి పనులపై, నువ్వు చేసిన పనులపై చర్చకు సిద్ధం.. స్టేషన్ ఘనపూర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు రావాలని సవాల్ చేశారు. అలాగే అసలు సిసలైన కాంగ్రెస్ నాయకులకు పదవులు రాకుండా కడియం అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఎక్కువ మాట్లాడకుండా కుక్కిన పేనులాగా ఉండు బిడ్డా అంటూ కడియం శ్రీహరికి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు.

## జగిత్యాల జిల్లాలో విష జ్వరాలకు ఇద్దరు చిన్నారుల మృతి

**జగిత్యాల, జూలై 25 :** జిల్లాలోని పొరండ్ల గ్రామంలో విషజ్వరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామంలో విషజ్వరాల బారిన పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. విషజ్వరంతో బాధపడుతున్న హారిస్మిత(6) అనే చిన్నారి.. చికిత్స పొందుతూ మృతి చెందింది. శుక్రవారం వరుణ్ తేజ(6) అనే చిన్నారి కూడా విషజ్వరం బారిన పడి ప్రాణాలు కోల్పోయాడు. వైరల్ ఫీవర్ కారణంగానే చిన్నారులు మరణించినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇద్దరు చిన్నారుల మృతితో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పొరండ్ల గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. జిల్లాలో పరిస్థితిపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం: బండి



**హైదరాబాద్,జులై 25 :** 'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. ' ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

## కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ వైఫల్యం స్పష్టం

**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి వ్యాఖ్య**

**నాగర్ కర్నూల్,జులై 25 :** నీట్ ప్రశ్నా పత్రాల లీకేజి విషయంలో కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ వైఫల్యం స్పష్టంగా ఉందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, యువకులు, విద్యావేత్తలు ఎంతగా కోరినా కేంద్రం పెడచెవిన పెట్టడం వల్ల పరిస్థితి చేయి దాటిందని పేర్కొన్నారు. వాంగ్ చుక్ దీక్ష విషయంలో, కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళన విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఏమాత్రం సమంజసంగా లేదని వెల్లడించారు. విద్యార్థుల మీద అమానుషంగా ప్రవర్తించడం ప్రతీ భారతీయుడ్ని కదిలించిందని వివరించారు. ప్రజాగ్రహాన్ని గ్రహించే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని తెలిపారు. అనేక మంది రైతులు మరణించిన తర్వాత సాగు చట్టాలను రద్దు చేసినట్లే, అనేక మంది విద్యార్థులు నష్టపోయిన తర్వాత ధర్మేంద్రతో రాజీనామా చేయించడం మోదీ చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లయిందని విమర్శించారు. నీట్ లాంటి జాతీయ పరీక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మరింత బాధ్యతగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువశక్తి విజయం

**బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**



**నిజామాబాద్,జూలై25 :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత మొక్కవోని పోరాట పటిమతో సాధించిన ప్రజాస్వామ్య విజయమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత రాజకీయాలకు అతీతంగా తమ భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం చేపట్టిన ఉద్యమం చివరకు ఫలితాన్ని ఇచ్చిందన్నారు. పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలు, విద్యార్థుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితికి వ్యతిరేకంగా యువత శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా చేసిన పోరాటానికి కేంద్ర ప్రభుత్వం చివరకు స్పందించి దిగిరాక తప్పలేదన్నారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం లాఠీచార్జీలు, భాష్పవాయు గోళాలు, నిర్బంధాలను ఆశ్రయించినప్పటికీ, దేశ యువత ఏమాత్రం వెనక్కి తగ్గకుండా అపారమైన ధైర్యంతో తమ ఉద్యమాన్ని కొనసాగించిందన్నారు. 'అధికారం ఎంత బలంగా కనిపించినా, చైతన్యవంతమైన యువత సంకల్పం ముందు తలవంచక తప్పదనే విషయాన్ని ఈ ఉద్యమం మరోసారి నిరూపించింది' అని అన్నారు. యువత ఐక్యపోరాటం ముందు ప్రభుత్వం దిగివచ్చే పరిస్థితి ఏర్పడిందని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఆ ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన నైతిక విజయమని పేర్కొన్నారు. కానొక సందర్బం లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నట్టు ?'దేశం కోసం అవసరం వచ్చినప్పుడు ఇండియా రియాక్ట్ అవుతుంది'? అనే మాటలను ఎమ్మెల్యే గుర్తు చేశారు. నేడు దేశ యువత అదే విషయాన్ని మరోసారి సాక్షాత్కరించిందన్నారు. 'యువత ప్రశ్నించడం ప్రారంభిస్తే అధికార వ్యవస్థలు జవాబుదారీతనం వహించక తప్పదు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకే అంతిమ తీర్పు' అని అన్నారు. చదువుకున్న యువత కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాదు... దేశ భవిష్యత్తు కోసం కూడా పోరాడుతుందని ఈ ఉద్యమం స్పష్టం చేసింది. జ్ఞానం, చైతన్యం, ఐక్యత కలిసొస్తే ఏ అహంకారమైనా కూలిపోవాల్సిందే' అని వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, విద్యా వ్యవస్థ విశ్వసనీయత, పరీక్షల పారదర్శకత వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. 'సమస్యలు మొదలైన వెంటనే బాధ్యతాయుతంగా స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. విద్యార్థుల ఆవేదనను నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి' అని విమర్శించారు. ఇకపై దేశంలో ఏ విద్యార్థి కూడా పరీక్షల అవకతవకల కారణంగా నష్టపోకుండా కఠినమైన, పారదర్శకమైన పరీక్షల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. 'ఇది ఒక వ్యక్తి రాజీనామాతో ముగిసే అంశం కాదు. దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో సంపూర్ణ విశ్వాసం నెలకొనే వరకు సంస్కరణలు కొనసాగాలి. అదే ఈ ఉద్యమం ఇచ్చిన అసలైన సందేశం' అని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు., ÷శ యువతకు ఈ విజయం ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుందని, ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా పోరాడితే మార్పు సాధ్యమేననే నమ్మకాన్ని ఈ ఉద్యమం దేశ ప్రజల్లో మరింత బలపరిచిందని ఆయన పేర్కొన్నారు

## గుజరాత్‌లో వరదల బీభత్సం

**వల్సాద్‌లో నీట మునిగిన గృహసముదాయాలు**

**గాంధీనగర్, జూలై 25 :** గుజరాత్‌లోని వల్సాద్‌లో భారీ వర్షాలకు నివాస సముదాయాలు నీట మునిగాయి. ఓ వ్యక్తి తన ఇంటి బయట వరద నీటిలో నిలబడి ఉన్న వీడియో వైరల్ అయింది. ఇక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ఆ వీడియో చూస్తే తెలుస్తోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా వీధులు, రోడ్లు పూర్తిగా నీట మునిగిపోవడంతో, సదరు యువకుడు తన ఇంటి బయట మెడలోతు వరద నీటిలో నిలబడి పరిస్థితిని వివరించాడు. పార్క్ చేసిన వాహనాలు, ప్రహరీలు, భవనాల పైభాగాలు మాత్రమే బయటకు కనిపిస్తున్న ఈ దృశ్యాలు వరద తీవ్రతను స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ వీడియోలో సదరు వ్యక్తి మునిగిపోయే స్థాయిలో నీరు చేరడం చూసి నెటిజన్లు షాక్ అవుతున్నారు. వీధులు, ఖాళీ స్థలాల మధ్య తేడా తెలియకుండా అంతా జలమయం కావడంతో అక్కడి నివాసితుల దైనందిన జీవితం పూర్తిగా స్తంభించిపోయింది. పట్టణాల్లో అరకొరగా ఉన్న మురుగునీటి పారుదల వ్యవస్థలు, ఈ తరహా ముంపునకు ప్రధాన కారణమని ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ దృశ్యాలు చూసిన పలువురు నెటిజన్లు శివమ్ సింగ్, ఇతర నివాసితులు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని కోరారు. మరోవైపు అధికారులు, రెస్క్యూ టీమ్ ఇప్పటికే పలువురిని సురక్షిత ప్రదేశాలకు తరలించినట్లు సమాచారం.

# కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు?



**విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. తమ కంట్రోల్‌లో తీసుకునేందుకు రాహుల్ నానా యాతన పడుతున్నారు. తానే ముందుండి ఇదంతా నడిపిస్తున్న ట్లుగా వ్యవహరించారు. ప్రధాని మోడీ నివాసం ముందు ఆకస్మిక ధర్నాకు దిగడం, రాష్ట్రాల్లో మద్దతుగా కాంగ్రెస్ ఆందోళనలకు దిగడం చూస్తుంటే కాంగ్రెస్ రాజకీయ లబ్ది పొందేందుకు ఎత్తులు వేస్తోందని అర్థం అవుతోంది. అభిజిత్ దీప్కే వెనకాల కాంగ్రెస్ ఉందా లేదా అన్నది తెలియదు. ఒకవేళ ఉంటే విద్యార్థులు వెంటనే కాంగ్రెస్‌ను పక్కన పెట్టాలి. ఎందుకంటే విద్యార్థుల ఉద్యమం పక్కదారి పట్టే అవకాశం ఉంది. విద్యార్థులు ఉద్యమించడం ద్వారా ఒక్క నీట్ సమస్య కాకుండా అనేక సమస్యలు, ముఖ్యంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే ఛాన్స్ ఉంటుంది.**

కాంగ్రెస్‌ను దగ్గరకు రానీయనంతవరకు అభిజిత్ దీప్కే ఉద్యమానికి ధోకా ఉండదు. ఎందుకంటే నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. యువత కూడా జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనకు రావడంలో నిజాయితీ ఉంది. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో రెండు వర్గాలు గాయపడ్డాయి. ఈ ఉద్యమంలో ప్రధాన ఎజెండా పేపర్ లీకుల నుంచి విషయం తప్పుదారి పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉద్యమంలో యువత పాల్గొంటున్నప్పటికీ, వారితో పాటు కొన్ని మత శక్తులు కూడా ప్రవేశించాయని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద అసలైన ఎజెండా పక్కకు పోయి రామమందిరం, హిందూ దేవతల్ని తిట్టడం, జర్నలిస్టులపై దాడులు, భారత సైన్యంపై విద్వేష వ్యాఖ్యలు, జిహాద్ నినాదాలు వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని శక్తులు ఈ ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థి ఉద్యమం మత ఉద్యమంగా మారుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, నిహాంగ్ సిక్కులు కత్తులు, కిర్పాన్లు, ఈటెలతో కనిపించడం మరింత వివాదాస్పదమైంది. వీటిని ఊపుతూ ప్రదర్శనలు చేయడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు మేధావులు కూడా ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమన్వయం లేకపోతే ప్రశాంతమైన ఉద్యమం బయటి శక్తుల ప్రయోజనాలకు ఉపయోగించే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాత్రి యూట్యూబర్లపై దాడి, నిరసనకారులు–నిహాంగ్ సిక్కులకు మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుతుండటం మహిళల భద్రతకు ప్రమాదంగా మారింది.

ఒక యువతిపై లైంగిక వేధింపులకు ప్రయత్నిస్తున్న వీడియో బయటకు రావడం మరింత ఆందోళనకు గురిచేసింది. పేపర్ లీక్ అంశాలతో పాటు మతం, ప్రాంతీయ ఉద్యమాలు, రాజకీయ అంశాలు ప్రస్తావనకు వస్తుండటం చూస్తే ఉద్యమం అసలు లక్ష్యం బలహీనపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై గత కొద్ది రోజులుగా జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. చలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ నిర్వహించారు. దీంతో చాలా మంది బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా కూడా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. దీంతో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థులకు మద్దతు లభించింది. సినీ, క్రికెటర్లు, విపక్ష రాజకీయ నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ఈ క్రమంలో తాజాగా జంతర్‌మంతర్ దగ్గర కిలోమీటర్ దూరంలో ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంతాపంగా గాంధీ స్మృతి వనం దగ్గర నివాళులర్పించారు. విద్యార్థులకు ఇండియా కూటమి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇదంతా కూడా కాంగ్రెస్ ఉద్యమాన్ని తన గుప్పిట్లోకి తీసుకుని పోయే యత్నంగా గోచరిస్తున్నది. గత రెండు నెలలుగా పెద్దగా పట్టించుకోని కాంగ్రెస్ అకస్మాత్తుగా ఇప్పుడు ముందువరసలోకి రావడానికి యత్నిస్తోంది. బిజెపి కూడా ఇంతకాలం తాత్సారం చేస్తూ వచ్చింది. పరీక్షలో అక్రమాల ఆరోపణలు, పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక పరిపాలనా మార్పులు చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న వినీత్ జోషిని ఆ పదవి నుంచి తప్పిస్తూ, ఆయన స్థానంలో నరేశ్ పాల్ గంగ్వార్ ను నియమించింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది.

రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన గంగ్వార్, కేంద్రంతో పాటు రాజస్థాన్ ప్రభుత్వంలో కూడా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సజిపి ప్రధాన డిమాండ్‌గా పెట్టుకుంది. కానీ కేంద్రం ఈ డిమాండ్‌ను పక్కన పెట్టింది. ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఈ నిరసనలో పాల్గొని నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. జూలై 20న 'చలో పార్లమెంట్' కార్యక్రమానికి పిలుపునివ్వగా, నిరసనకారులు, ఢిల్లీ పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల అనంతరం కేంద్ర ప్రభుత్వం పలుమార్లు సిజిపి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. అయితే, కేంద్ర మంత్రులే జంతర్ మంతర్ లేదా నిరసన ప్రాంతానికి సమీపంలోని వేదికకు రావాలని కాక్రోచ్ పార్టీ స్పష్టం చేసింది. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు తీసుకుంటుండగా, రానున్న రోజుల్లో ఈ అంశంపై మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉద్యమం పక్కదాని పట్టకుండా, రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అభిజిత్ దీప్కేతో పాటు, ఆయన అనుచరులపై ఉంది.

26-07-2026 — ఎడిటర్

# నా దీక్షనే అనుమానిస్తారా...?

**కేంద్రంతో లాలూచీ పడతాననుకున్నారా**
**విమర్శలపై సోనమ్ వాంగ్‌చుక్ ఘాటు స్పందన**



**న్యూఢిల్లీ, జూలై 25 :** దాదాపు 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఇటీవల కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో దీక్షను విరమించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ నెరవేరకపోయినా తాను ఎందుకు నిరాహార దీక్ష విరమించాల్సి వచ్చిందో తాజాగా సోనమ్ వివరించారు. ప్రభుత్వంతో ఎలాంటి రహస్య ఒప్పందమూ చేసుకోలేదని, నిరసనకారుల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై హింసాత్మక చర్యలు జరిగే అవకాశం ఉందన్న ఆందోళన తనకు కలిగిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. గతంలో లడఖ్‌లో జరిగిన పోలీసు చర్యల మాదిరిగా పరిస్థితి మారకూడదనే ఉద్దేశంతో ఉపవాసాన్ని ముగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని అంశాలపై లిఖితపూర్వక హామీ లభించిందని ఆయన తెలిపారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన వారిపై ప్రతీకార చర్యలు ఉండవని, వారి సమస్యలపై చర్చ కొనసాగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. అయితే, దీక్ష విరమించడం అంటే ఉద్యమం ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. కాగా, జంతర్ మంతర్‌లో నిరసన చేపడుతున్న సీజేపీ నేతలు మాత్రం తమ ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని వారు వెల్లడించారు. పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజులు చేసిన నిరాహార దీక్షను కేంద్రమంత్రుల సమక్షంలో విరమించిన నేపథ్యంలో.. డీల్ కుదిరిందంటూ ఆయనపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిని ఆయన తీవ్రంగా ఖండించారు. 'నేను చేసిన దీక్ష ఎంత స్వచ్ఛమైందో నిరూపించుకునేందుకు సర్టిఫికెట్ కావాలా.. అని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే దీక్ష విరమించడంపైనా స్పందించారు. దీక్ష విరమించినప్పటి నుంచి చాలా మంది నాకు ఫోన్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు చూపిస్తూ.. మీపై పలు సందేహాలు వస్తున్నాయని చెప్తున్నారు. కేంద్రమంత్రుల సమక్షంలోనే ఎందుకు దీక్ష విరమించారు..? ఏం ఒప్పందం జరిగింది..? అని అడుగుతున్నారు. నేను నిరాహార దీక్ష ఎంత పవిత్రంగా చేశానో ఎవరి నుంచైనా సర్టిఫికెట్ తీసుకోవాలా..? ఇలా బేరాలు కుదుర్చుకోవాల్సి వస్తే.. ఎవరైనా 26 రోజులు ఆకలితో ఉంటారా..? ఢిల్లీ ఎండలో రోడ్డు పక్కన కూర్చునే బదులు.. ఏసీ గదిలో కూర్చొని డీల్ చేసుకోలేనా' అని తనపై వస్తోన్న విమర్శలకు వాంగ్‌చుక్ కౌంటర్ ఇచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనేది కచ్చితంగా ముఖ్యమైన విషయం. అయితే నిరసనకారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిరోధించడమే నాకు ప్రాధాన్య అంశంగా అనిపించింది. అందుకే కేంద్రంతో చర్చల సమయంలో రాజీనామా గురించి నేను డిమాండ్ చేయలేదు. రాజీనామాను వ్యక్తిగతంగా ప్రస్తావించా ల్సిన అవసరం ఉందని అనుకోవడం లేదు. దీన్ని కేంద్రం పెద్ద విషయంగా భావించడం లేదు. రాజీనామా అంశాన్ని నిరాకరించడం వల్ల అపారనష్టాన్ని చవిచూస్తోంది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజారుతోంది. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాజీనామా విషయంలో ఎటూ తేల్చకుండా కేంద్రం ఎక్కువ కాలం నాన్చలేదు. కొన్నిరోజుల్లో మంత్రి రాజీనామా సమర్పిస్తారని నాకు తెలుసు. అందుకే ఆ విషయంలో నేను మరీ ఎక్కువ ఒత్తిడి చేయలేదు' అని వాంగ్‌చుక్ వివరించారు. దీక్ష కొనసాగిస్తున్న సమయంలో.. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్‌మంతర్ నుంచి సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి పరిస్థితులపై తాజాగా వాంగ్‌చుక్ స్పందించారు. ఆ ఆసుపత్రి జైలులా అనిపించింది. ఒక ఖైదీ కంటే తీవ్రంగా పరిగణించారు. చుట్టూ ఆంక్షలే. నేను నా గది నుంచి కూడా రాలేకపోయా. ఎవరిని కలవడానికి అనుమతించలేదు. ముగ్గురు బంధువులను మాత్రం నావద్దకు రానిచ్చారు అంటూ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆయన భార్య గీతాంజలి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయడంతో.. అక్కడి నుంచి మేదాంత ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే.

# నీట్ రద్దుతో విద్యార్థుల్లో పెరిగిన పట్టుదల

**మరింత మెరుగైన ప్రతిభ కోసం కష్టపడ్డారు**
**ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్య**



**న్యూఢిల్లీ, జూలై 25 :** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్షల పేపర్ లీకేజీల వివాదంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భిన్నంగా స్పందించారు. పేపర్ లీక్‌లు జరిగినప్పుడు మొదట్లో విద్యార్థులు తీవ్రంగా బాధపడినప్పటికీ, ఆ తర్వాత ఆ సవాలును స్వీకరించి మరింత బాగా చదివి ప్రతిభను మెరుగుపరుచుకున్నారని ఆమె తెలిపారు. ముందు బాధనిపించింది.. తర్వాత దాన్నే అవకాశంగా మలచుకుని మెరుగ్గా రాశామని పలువురు విద్యార్థులు చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలపై ఓ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. పరీక్షల పవిత్రతను దెబ్బతీసిన వారిపై సత్వర చర్యలు తీసుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా స్పందించారని మంత్రి చెప్పారు. నిందితుల అరెస్టులు, సకాలంలో మళ్లీ పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను విడుదల చేయడం ద్వారా విద్యార్థులు తమ ఉన్నత విద్య వైపు అడుగులు వేయగలుగుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ చర్యల వల్ల ప్రతిపక్షాల విమర్శలకు విలువే లేకుండా పోయింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, పేపర్లను అమ్మిన, కొనుగోలు చేసిన నేరస్తుల అరెస్టులు శరవేగంగా జరుగుతున్నాయి' అని ఆమె స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్టీఏకు చెందిన 47 మంది ఉద్యోగులను ప్రభుత్వం తొలగించిందని ఆమె పేర్కొన్నారు.

# అభిజిత్ దీప్కేకు టైఫాయిడ్

**స్వయంగా వెల్లడించిన సీజేపీ) వ్యవస్థాపకుడు**



**న్యూఢిల్లీ, జూలై 25 :** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభి జీత్ దీప్కే అనారోగ్యానికి గురయ్యా రు. నీట్ పేపర్ లీక్‌పై నెల రోజు లుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టిన ఆయనకు టైఫాయిడ్ వచ్చింది. తనకు టైఫా యిడ్ వచ్చిన విషయాన్ని సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా అభిజీత్ దీప్కే వెల్లడించారు. తనకు టైఫాయిడ్ వచ్చిందని, చికిత్స తీసు కుంటున్నట్లు తెలిపారు. ఇటీవల వైద్య పరీక్షలు చేయించగా వ్యాధి నిర్ధారణ అయినట్లు చెప్పారు. ప్రస్తు తం రోజుకు రెండుసార్లు ఇంట్రావీనస్ చికిత్స తీసుకుంటున్నట్లు దీప్కే పేర్కొన్నారు. తాను అనారోగ్యానికి గురైనా విద్యా వ్యవస్థలో జవాబుదారీ తనం కోరుతూ చేపట్టిన నిరసన దీక్ష మాత్రం కొనసాగుతుందని చెప్పారు. అలాగే, నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని అభిజీత్ తన వీడియో సందేశంలో తేల్చి చెప్పారు. మరోవైపు, దీప్కేతో పాటు పలువురు సీజేపీ మద్దతుదారులు, కార్యకర్తలు కూడా అనారోగ్యానికి గురైనట్లు తెలుస్తోంది. 'అందరికీ నమస్కారం. కొన్ని రోజులుగా నా ఆరోగ్యం బాగోలేదని మీ అందరికీ తెలుసు. అందుకే రక్త పరీక్షలు చేయించాను. రిపోర్టుల్లో టైఫాయిడ్ అని నిర్ధారణ అయింది. చికిత్స కొనసాగుతోంది. నాకు ప్రతి ఉదయం, సా యంత్రం ఐవీ డ్రిప్స్ పెడుతున్నారు. దేశవ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బొద్దింకలందరికీ నేను నిజంగా ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నా. మీ వల్లే ఈ ఉద్యమం ఇంత విజయవంతమైంది. మీ అందరికీ చాలా చాలా ధన్యవాదాలు. ఈ ఉద్యమాన్ని ఇంత పెద్ద విజయంగా మార్చినందుకు మీ అందరికీ అభినందనలు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ చేపట్టిన ఉద్యమం కొనసాగుతుంది' అని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.



# నల్ల సముద్రంలో నౌకపై దాడి..

**భారతీయుడి మృతి**

**న్యూఢిల్లీ :** నల్ల సముద్రంలో ఓ వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు. నౌకలో పది మంది సిబ్బంది ఉండగా.. అందులో ముగ్గురు భారతీయులేనని, వీరిలో ఇద్దరు సురక్షితంగా ఉన్నారని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఎంవీ ఒమోర్ఫీ అనే వాణిజ్య నౌక జులై 18న రష్యా ప్రాదేశిక జలాల్లో వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై రష్యాలోని భారత రాయబార కార్యాలయం సంబంధిత అధికారులను సంప్రదించిందని, బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా సహాయం అందించేందుకు ప్రయత్నిస్తోందని విదేశాంగశాఖ పేర్కొంది. మరోవైపు, వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. అమాయక పౌరుల ప్రాణాలకు ముప్పు కలిగించేలా, అంతర్జాతీయ సముద్ర వాణిజ్యాన్ని ప్రమాదంలో పడేసే ఇలాంటి సంఘటనలు ఇటీవల పెరుగుతుండడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పేర్కొంది. ఇదిలా ఉంటే, జులై 19న ఉక్రెయిన్ తీరంలో ఒక వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో మరణించిన 10 మందిలో నలుగురు భారతీయులు ఉన్నట్లు విదేశాంగ శాఖ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

# జెన్-జీని చూస్తుంటే గర్వంగా ఉంది: జ్యోతిక



**న్యూఢిల్లీ :** జెన్–జీని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు సినీ నటి జ్యోతిక. ప్రస్తుతం దేశంలో చర్చనీయాంశంగా మారిన పరిణామాలపై ఆమె ఇన్‌స్టాలో పోస్టు పెట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే విద్యార్థుల డిమాండ్‌కు తాను మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. "నేను విద్యార్థులు, మన దేశ భవిష్యత్తు కోసం ఆలోచిస్తాను. జవాబుదారీతనానికి మద్దతు ఇస్తాను. ప్రజాస్వామ్య భారతదేశం కోసం.. మంచి విద్యా వ్యవస్థ కోసం నిలబడతాను" అని పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేలను ఆమె ప్రశంసించారు. "ఒక తల్లిగా మా పిల్లలను మీలాగే పెంచాలని కోరుకుంటున్నా. నిర్భయంగా, ఎలాంటి ముసుగులు లేకుండా పోరాడుతోన్న జెన్–జీ యువతను చూసి గర్విస్తున్నాను. అందరూ కలిస్తేనే దేశం ముందుకు వెళ్తుందని మీరు నిరూపించారు. ఒత్తిడిని అధిగమించినందుకు.. మాలో భయాన్ని తొలగించినందుకు ధన్యవాదాలు" అని జ్యోతిక తన పోస్టులో రాసుకొచ్చారు. నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేస్తోన్న ఉద్యమానికి సినీ ప్రముఖుల నుంచి మద్దతు పెరుగుతోంది. దర్శకుడు శేఖర్ కమ్ముల కూడా జెన్ జీ ఉద్యమం తనలో స్ఫూర్తినింపిందని పేర్కొన్నా రు. విద్యార్థుల డిమాండ్లలో న్యాయం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వాళ్ల మాట వినాలని.. భరోసా ఇవ్వాలని కోరారు. విద్యార్థులు గెలిస్తే దేశం గెలిచినట్లేనని అన్నారు.



# ధర్మేంద్ర ప్రధాన్ మరో శాఖకు మారొచ్చు

**కేంద్రం పరిశీలిస్తోందన్న రాహుల్**

**న్యూఢిల్లీ, జూలై 25 :** విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మరో శాఖకు మార్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్న వార్తలు ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించబోదన్న వార్తల నడుమ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సహా మూడు డిమాండ్స్‌ను విద్యార్థులు ప్రభుత్వం ముందు పెట్టారని అన్నారు. వీటి విషయంలో వారు రాజీపడబోరని అభిప్రాయపడ్డారు. 'అసమర్థ, అవినీతి మరక అంటిన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది మొదటి డిమాండ్. అయితే, ఆయన శాఖ మార్చే అంశం ప్రధాని కేబినెట్‌లో చర్చకు వచ్చినట్టు టాక్ వినిపిస్తోంది. భారతీయ విద్యార్థులు దీన్ని అస్సలు ఆమోదించరు. దీన్ని ఎవ్వరూ ఒకప్పుకోరు' అని రాహుల్ గాంధీ చెప్పారు. ధ్వంసమైన విద్యార్థుల భవిష్యత్తు, అవినీతికి ఆయన సంకేతంగా నిలిచారని వ్యాఖ్యానించారు. ఆయనను తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. సోమవారం నాటి విద్యార్థుల ర్యాలీలో పోలీసులు పెలెట్ గన్స్, లాఠీ చార్జ్‌కు దిగడాన్ని కూడా రాహుల్ గాంధీ ఖండించారు. ఈ చర్యలకు దిగిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాం డ్ చేశారు. భారత దేశ విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని మరోసారి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ఒక గతమని, భవిష్యత్తు కోసం ఆయన పోరాడజాలరని వ్యాఖ్యానించారు.

# హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం అక్కసు

- **మూడేళ్ల పాటలు వీసాలు నిలిపివేసే బిల్లుకు ప్రతిపాదన**
- **సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు పెట్టిన రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ**

**న్యూఢిల్లీ,జూలై 25 :** హెచ్–1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం విధిస్తోన్న ఆంక్షలతో సతమతమవుతున్న భారతీయులను.. ఇప్పుడు మరో బిల్లు ఆందోళనకు గురిచేస్తోంది. రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులో.. కొత్త హెచ్–1బీ వీసాల జారీని మూడు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ప్రతిపాదించారు. అలాగే ట్రంప్ యంత్రాంగం విధించిన లక్ష డాలర్ల ఫీజును చట్టబద్ధం చేయాలని పేర్కొన్నారు. అమెరికన్ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్న వీసాలను జారీ చేయకూడదని కోరారు. 'ఎండ్ హెచ్–1బీ వీసా యాక్ట్' పేరిట ప్రవేశపెట్టిన బిల్లులో ఈ ప్రతిపాదనలు చేశారు. కొన్ని ప్రత్యేక పోస్టులను నిపుణులైన విదేశీయులతో భర్తీ చేసేందుకు ఈ హెచ్–1బీ ప్రోగ్రామ్‌ను తీసుకువచ్చారు. అంతే గానీ అర్హత ఉండి కష్టపడి పనిచేసే అమెరికన్ల స్థానంలో తక్కువ వేతనాలకు లభ్యమయ్యే విదేశీ శ్రామికులతో భర్తీ చేయడానికి కాదు. నేను తీసుకువచ్చిన బిల్లు హెచ్–1బీ ప్రోగ్రామ్ అసలు ఉద్దేశాన్ని నెరవేర్చేందుకు ఉపయోగపడుతుంది. అందులోని లొసుగుల్ని ఉపయోగించుకోకుండా నివారిస్తుందని పేర్కొన్నారు. అందుకోసం మూడేళ్ల పాటు వీసా జారీని నిలిపివేసి, కఠిన నిబంధనలతో మళ్లీ కొత్తగా ఈ ప్రోగ్రామ్‌ను తీసుకురావాలని కోరారు. కొన్ని నెలల క్రితం రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఎలీ క్రేన్ ప్రతినిధుల సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏటా ఇస్తున్న 85,000 వీసాలను తగ్గించాలని.. లాటరీ విధానం కాకుండా అత్యధిక జీతం ఇచ్చే వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని.. హెచ్–1బీ వీసాదారులు భార్యాపిల్లలను అమెరికాకు తీసుకురావడంపై నిషేధం విధించాలనే ప్రతిపాదనలు ఈ బిల్లులో ఉన్నాయి. అయితే ఇది ఉభయసభల్లో ఆమోదం పొందిన తరవాతనే బిల్లుగా మారనుంది.



ప్రాంతీయం

# ఖమ్మంలో పట్టు పరిశ్రమ
# క్లస్టర్‌కు కసరత్తు

- 1000 ఎకరాల లక్ష్యంతో జిల్లా స్థాయి కీలక సమావేశం
- క్లస్టర్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై వేగంగా అధ్యయనం..
- కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశాలు
- 'నా పట్టు-నా అభిమానం 2.0'లో రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులతో విస్తృత చర్చ
- ఖమ్మాన్ని తెలంగాణలో పట్టు పరిశ్రమ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం
- 150 ఎకరాల నుంచి 1000 ఎకరాలకు విస్తరణ లక్ష్యం
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- తక్కువ నీరు.. తక్కువ రిస్క్.. అధిక ఆదాయం
- రైతులకు పట్టు సాగు ఉత్తమ ప్రత్యామ్నాయం
- రైతుల భాగస్వామ్యంతో నాణ్యమైన ఉత్పత్తి, మార్కెటింగ్‌కు కొత్త దిశ



**ఖమ్మం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, జూలై 25:** ఖమ్మం జిల్లాను తెలంగాణలోనే పట్టు పరిశ్రమకు ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించింది. ప్రస్తుతం జిల్లాలో కేవలం 150 ఎకరాల్లో సాగవుతున్న పట్టు పరిశ్రమను త్వరలోనే 1000 ఎకరాలకు విస్తరించే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర పట్టు బోర్డు, తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సంయుక్తంగా నిర్వహించిన "నా పట్టు -- నా అభిమానం 2.0" జిల్లా స్థాయి భాగస్వాముల సంప్రదింపుల సమావేశంలో కలెక్టర్ చేసిన వ్యాఖ్యలు రైతుల్లో కొత్త ఆశలు నింపాయి. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జరిగిన సమావేశంలో పట్టు సాగు చేస్తున్న రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి సాగు విస్తీర్ణం, పెట్టుబడి, నీటి వినియోగం, దిగుబడి, ఆదాయం వంటి అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో పట్టు పరిశ్రమకు అపార అవకాశాలు ఉన్నాయని, దీనిని రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచే ప్రత్యామ్నాయ వ్యవసాయ రంగంగా అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. పట్టు సాగుకు తక్కువ నీరు సరిపోతుందని, ఇతర పంటలతో పోలిస్తే రిస్క్ కూడా తక్కువగా ఉండి ఆదాయం అధికంగా వస్తుందని కలెక్టర్ వివరించారు. అనుభవజ్ఞులైన రైతులు కొత్త రైతులకు మార్గనిర్దేశం చేసి పట్టు సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను ప్రతి రైతు అందిపుచ్చుకుని ఉత్పాదకత, నాణ్యతను పెంచుకోవాలని, తద్వారా ఖమ్మం జిల్లాకు పట్టు పరిశ్రమలో ప్రత్యేక క్లస్టర్ హోదా సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలతో పాటు రైతులు కూడా భాగస్వామ్య బాధ్యతతో ముందుకు వస్తే పట్టు పరిశ్రమ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఒక్కో రైతు విడివిడిగా సాగు చేయడం కంటే రైతులు సంఘాలుగా ఏర్పడి సమిష్టిగా ఉత్పత్తి, మార్కెటింగ్ చేపడితే మెరుగైన ధరలు, అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు. సబ్సిడీ పెంపుపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర పట్టు బోర్డు, బెంగళూరు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ "నా పట్టు -- నా అభిమానం 2.0" కార్యక్రమం ప్రధాన ఉద్దేశం రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో అందించి నాణ్యమైన పట్టు ఉత్పత్తిని పెంచడం, రైతుల ఆదాయాన్ని గణనీయంగా మెరుగుపరచడమేనని వివరించారు. పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త సంచాలకులు అనసూయ జిల్లాలో శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించగా, సమావేశంలో బేస్‌లైన్ సర్వే ఫలితాలను సమీక్షించారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, నాణ్యమైన పట్టు ఉత్పత్తి, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పట్టు బోర్డు ములుగు కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపమ్ రెడ్డి, డాక్టర్ గుండి రాఘవేందర్, హార్టికల్చర్ అధికారిణి అనిత శ్రీ, వివిధ శాఖల అధికారులు, రైతు ప్రతినిధులు, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. పట్టు పరిశ్రమకు ఖమ్మం కేంద్రబిందువుగా మారే దిశగా జిల్లా యంత్రాంగం ప్రకటించిన 1000 ఎకరాల లక్ష్యం రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపగా, ప్రత్యామ్నాయ వ్యవసాయానికి ఇది కీలక మలుపుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి



## ప్రభుత్వ ఆసుపత్రులే ప్రజల తొలి నమ్మకం కావాలి

- మంచుకొండ పీహెచ్‌సీ లో కలెక్టర్ దివాకర టీఎస్ ఆకస్మిక తనిఖీ..
- సేవల నాణ్యతపై కఠిన ఆదేశాలు
- మందుల కొరతకు తావులేకుండా నిల్వలు సిద్ధంగా ఉంచాలి
- ల్యాబ్ రిపోర్టులు ఆలస్యం కాకూడదు

**ఖమ్మం, ఆర్గాన్ న్యూస్ , జూలై 25:** ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు అత్యంత విశ్వసనీయ ఆరోగ్య సేవల కేంద్రాలు గా నిలవాలని, ప్రతి రోగికి నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందేలా వైద్యాధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. మందుల కొరత, ల్యాబ్ పరీక్షల ఆలస్యం, సేవ ల్లో నిర్లక్ష్యం వంటి అంశాలకు ఏమాత్రం తావివ్వొద్దని అధికారులను ఆదేశించారు. శనివారం రఘునాథపాలెం మండలం మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, ఔషధ నిల్వలు, ల్యాబ్ సేవలు, మెడికల్ వార్డులు, రోగుల నమోదు, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్యాజువాలిటీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఔషధ నిల్వల గదిని తనిఖీ చేసిన కలెక్టర్, అత్యవసర మందులతో పాటు నిత్యం అవసరమయ్యే అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పటిష్టమైన స్టాక్ నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. మందుల కొరత కారణంగా ఒక్క రోగి కూడా ఇబ్బంది పడకూడదని స్పష్టం చేశారు. ల్యాబ్ పరీక్షల నివేదికలు ఆలస్యం కాకుండా త్వరితగతిన అందించి, రోగులకు సకాలంలో చికిత్స ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డయాగ్నస్టిక్ హబ్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రతి రోగికి అవసరమైన పరీక్షలు వేగంగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రమైన వాతావరణం, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, రోగులు వేచి ఉండేందుకు సరైన ఏర్పాట్లు, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్యాధికారులకు సూచించారు. అలాగే ప్రతి ప్రత్యేక వైద్య విభాగం సేవలు, వైద్యుల అందుబాటు రోజులు, పరీక్షల వివరాలు, మందుల సమాచారం ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై మరింత విశ్వాసం పెంచాలని సూచించారు. ఈ తనిఖీలో రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో అశోక్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## శంషాబాద్ విమానాశ్రయంలో మంత్రి సీతక్కకు ఘన స్వాగతం

**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, జూలై 25:** అమెరికా తెలంగాణ అసోసియేషన్ (టీటీఏ) సమావేశాల్లో పాల్గొని విజయవంతమైన విదేశీ పర్యటనను ముగించుకుని స్వదేశానికి చేరుకున్న తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)కు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా పర్యటన ద్వారా తెలంగాణకు పెట్టుబడుల ఆకర్షణ, ప్రవాస తెలంగాణవారితో బలమైన అనుబంధం ఏర్పరచడంలో మంత్రి సీతక్క చేసిన కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ స్వాగత కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఏటూరునాగారం మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో సోలార్ విప్లవానికి వేగం

- రైతు పొలంలో సోలార్ పంప్‌సెట్, ఇంటిపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌ను పరిశీలించిన ఉన్నతాధికారులు
- రైతులతో నేరుగా మాట్లాడిన రెడ్‌కో వైస్ చైర్మన్ ముషారఫ్ ఫరూఖీ, కలెక్టర్ దివాకర, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి
- ఉచిత విద్యుత్‌తో పాటు అదనపు ఆదాయం..
- రాష్ట్ర ప్రభుత్వ సోలార్ కార్యక్రమాలపై లబ్ధిదారుల హర్షం



**ఆర్గాన్ న్యూస్, ఖమ్మం ప్రతినిధి , జూలై 25:** వ్యవసాయ రంగంలో సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తృతం చేయడంతో పాటు రైతులకు విద్యుత్ ఖర్చు తగ్గించి అదనపు ఆదాయం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సోలార్ కార్యక్రమాలను శనివారం ఖమ్మం జిల్లాలో ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గార్లపాడు గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ పంప్‌సెట్ పనితీరును రైతు డిస్కం, రెడ్‌కో వైస్ చైర్మన్ ఽ ఎండీ ముషారఫ్ ఫరూఖీ, ఐఏఎస్, జిల్లా కలెక్టర్ దివాకర, ఐఏఎస్, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ పరిశీలించారు. రైతుతో నేరుగా మాట్లాడి పంప్‌సెట్ పనితీరు, నీటి వినియోగం, సాగులో కలుగుతున్న ప్రయోజనాలు, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. రైతు సోలార్ పంప్‌సెట్‌తో ఎంతో సంతృప్తిగా ఉన్నానని, వ్యవసాయ ఖర్చులు తగ్గాయని తెలిపాడు. అనంతరం అధికారులు రావినూతల గ్రామంలో ఇంటిపై ఏర్పాటు చేస్తున్న రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ పనులను పరిశీలించారు. లబ్ధిదారునితో నేరుగా మాట్లాడి పథకం అమలుపై వివరాలు తెలుసుకున్నారు. లబ్ధిదారుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఈ అవకాశంతో ఉచిత విద్యుత్ వినియోగించుకోవడంతో పాటు అదనపు ఆదాయం కూడా లభిస్తోందని, ఎంతో సంతోషంగా ఉందని వెల్లడించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తరించడం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌కో ఉన్నతాధికారులు, ఖమ్మం సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మంలో విద్యుత్ రంగ బలోపేతంపై ఉన్నతాధికారుల కీలక చర్చ

- ప్రజలకు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల విస్తరణపై సమీక్ష
- కలెక్టర్ దివాకరతో ముషారఫ్ ఫరూఖీ, వరుణ్ రెడ్డి సమావేశం

**ఖమ్మం కలెక్టరేట్, ఆర్గాన్ న్యూస్ , జూలై 25:** ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించిన రైతు డిస్కం, రెడ్‌కో వైస్ చైర్మన్ ఎండీ ముషారఫ్ ఫరూఖీ, టీజీఎన్‌పీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ కర్ణాటి వరుణ్ రెడ్డిలకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘన స్వాగతం పలికారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా పూల మొక్కలను అందించి వారిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లాలో విద్యుత్ సరఫరా వ్యవస్థ బలోపేతం, ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చేపడుతున్న చర్యలు, విద్యుత్ మౌలిక వసతుల విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాల్లో శాఖల సమన్వయం వంటి అంశాలపై కలెక్టర్ ఉన్నతాధికారులతో చర్చించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు టీజీఎన్‌పీడీసీఎల్ అందిస్తున్న సహకారాన్ని ఆయన అభినందించారు. అనంతరం ముషారఫ్ ఫరూఖీ, కర్ణాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా యంత్రాంగం చేపడుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందించడం, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం సంస్థ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లాలో విద్యుత్ రంగ అభివృద్ధి, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు జిల్లా యంత్రాంగం--టీజీఎన్‌పీడీసీఎల్ మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.




## లోన్లు ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తి అరెస్ట్


**మహబూబాబాద్, ఆర్గాన్ న్యూస్, జూలై 25:** నీతి అయోగ్ డైరెక్టర్ అని చెప్పుకుని గా కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇప్పిస్తానని నమ్మించి పలువురి వద్ద నుండి సుమారు 1,85,000 రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడిన వ్యక్తిని మహబూబాబాద్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి తెలిపారు. నీతి అయోగ్ డైరెక్టర్ అని ప్రభుత్వ పథకాల పేరుతో, ముఖ్యంగా గా కార్పొరేషన్ ద్వారా లోన్లు మంజూరు చేయిస్తానని నమ్మబలికి బాధితుల నుండి నగదు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ లోన్లు, సబ్సిడీలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు అడిగే వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, ప్రభుత్వ పథకాల కోసం సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలను మాత్రమే సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఎవరైనా ఇలాంటి మోసాలకు పాల్పడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

## 44 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసుల్లో శిక్షలు

**ఆర్గాన్ న్యూస్ ఖమ్మం, జూలై 25:** ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన 44 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసుల్లో స్పెషల్ మొబైల్ కోర్టు గౌరవ న్యాయమూర్తి శ్రీమతి బి. నాగలక్ష్మి కీలక తీర్పు వెలువరించారు. ఒకరికి 7 రోజుల జైలు శిక్ష విధించగా, మరో 43 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.4.30 లక్షల జరిమానా విధించారు. అదేవిధంగా, నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపిన ఒకరికి, ముగ్గురు మైనర్ డ్రైవర్లకు కూడా జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఖమ్మం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బెల్లం సత్యనారాయణ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకుని మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. అలాగే, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి సురక్షితమైన రహదారి ప్రయాణానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసుల ప్రాసిక్యూషన్‌కు సమర్థవంతంగా సహకరించిన అధికారులను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వేగం

- ప్రతి సోమవారం బిల్లులు నేరుగా ఖాతాల్లో జమ..
- లబ్ధిదారులు త్వరగా ఇళ్లు పూర్తి చేసుకోవాలి
- కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం, ఆర్గాన్ న్యూస్ , జూలై 25:** పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని, లబ్ధిదారులు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పిలుపునిచ్చారు. నిర్మాణ దశకు అనుగుణంగా ప్రతి సోమవారం బిల్లులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నందున పనుల్లో జాప్యానికి తావు లేదని స్పష్టం చేశారు. శనివారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఇంటిని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. అధికారులు పూర్తి సహకారం అందించి ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈర్లపూడిలో మొదటి విడతలో 160 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అందులో ఇప్పటికే 98 ఇళ్లు పూర్తికాగా, మరో 62 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. అధిక భాగం ఇళ్లు గోడల నిర్మాణం పూర్తి చేసుకుని స్లాబ్ దశకు చేరుకున్నాయని చెప్పారు. నిర్మాణంలో ఉన్న ప్రతి దశకు అనుగుణంగా ప్రభుత్వం ప్రతి సోమవారం బిల్లులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందని, ఇల్లు పూర్తయిన తర్వాత మొత్తం 5 లక్షల ప్రభుత్వ ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. పునాది దశను కూడా పూర్తి చేయలేని అర్హులైన లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణ సౌకర్యం కల్పించినట్లు గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రెవెన్యూ, హౌసింగ్, గ్రామపంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్మాణ సామగ్రి, సాంకేతిక సహాయం, బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా చూడాలని అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే నిర్మాణాలు పూర్తిచేసి ప్రతి లబ్ధిదారుడు తన సొంతింటిలో గృహప్రవేశం చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ తనిఖీలో హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఈఈ జగ్గారావు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో అశోక్, ఈర్లపూడి సర్పంచ్ గీతా దేవ్ సింగ్ పాల్గొన్నారు.

ప్రాంతీయం

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

# ప్రజాస్వామ్య విజయం

- విద్యార్థి శక్తి ముందు నిరంకుశత్వం తలవంచాల్సిందే
- ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి



**ఖమ్మం, ఆర్గాన్ న్యూస్ , జూలై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప విజయమని, విద్యార్థి శక్తి ముందు ఎలాంటి నిరంకుశ వైఖరైనా తలవంచాల్సిందేనని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనల అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు, భవిష్యత్తుతో ఆడుకున్న కేంద్ర ప్రభుత్వానికి ఈ పరిణామం గట్టి హెచ్చరికగా నిలిచిందని ఎంపీ విమర్శించారు. ఈ పరిణామం దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య శక్తులకు, పోరాట స్ఫూర్తికి కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు.

**రాహుల్ గాంధీ డిమాండ్‌ను పట్టించుకోలేదు**

పార్లమెంట్ సమావేశాల్లోనే నీట్ పేపర్ లీకేజీ అంశంపై సమగ్ర చర్చ జరగాలని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని రఘురాం రెడ్డి ఆరోపించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు చేపట్టినా, ప్రతిపక్షాలు పదేపదే ప్రశ్నించినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. కేవలం కేంద్ర మంత్రి రాజీనామాతో సమస్యకు పూర్తి పరిష్కారం లభించదని, పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగాలని ఎంపీ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పేపర్ లీకేజీలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, జాతీయ స్థాయి పోటీ పరీక్షలను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. అలాగే ప్రతిపక్షాల సూచనలకు, ప్రజల ఆకాంక్షలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.




# గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- బీసీ గురుకుల అధ్యాపకుల సదస్సులో పీఆర్టీయూ తీర్మానం
- జీరో-వన్-జీరో ద్వారా వేతనాలు, హెల్త్ కార్డులు, గెస్ట్ ఫ్యాకల్టీకి 12 నెలల జీతాలు ఇవ్వాలని డిమాండ్

**ఖమ్మం, ఆర్గాన్ న్యూస్ , జూలై 25:** మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అతిథి బోధకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలోని పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల ఉపాధ్యాయులు--అధ్యాపకుల సదస్సులో పలువురు ఉపాధ్యాయులు పాల్గొని తమ సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. సదస్సులో ముఖ్యంగా జీరో-వన్-జీరో విధానం ద్వారా ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని, గురుకుల ఉపాధ్యాయులకు వెంటనే హెల్త్ కార్డులు జారీ చేయాలని, సెలవు రోజుల్లో విధులు నిర్వహించిన వారికి సీసీఎల్ మంజూరు చేయాలని, అతిథి బోధకులకు 12 నెలల వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పీఆర్టీయూ అనుబంధ బీసీ గురుకుల కమిటీని ఏకగ్రీవంగా నియమించారు. కమిటీ కన్వీనర్‌గా ఆర్. రాము, కో-కన్వీనర్లుగా బి. లక్ష్మీనారాయణ, బి. మహేష్, మహిళా ప్రతినిధిగా రాణి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రంగారావు, మాజీ జిల్లా అధ్యక్షుడు మోత్కూరు మధు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు టి. రత్నకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పి. చంద్రశేఖర్, ఎల్. సతీష్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు రాయల్ నరసరావు, వివిధ మండలాల అధ్యక్షులు, జిల్లా నాయకులతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన సుమారు 200 మంది గురుకుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సదస్సులో ప్రభుత్వం గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించి, విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పీఆర్టీయూ నాయకులు కోరారు.



### భద్రాచలం రామాలయంలో వైభవంగా

# శ్రీరామాత్మక వరుణయాగం

**ప్రజల సుభిక్షం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు**

**భద్రాచలం, జూలై 25 (ఆర్గాన్ న్యూస్):** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం ఆగమశాస్త్ర నియమాలకు అనుగుణంగా శ్రీరామాత్మక వరుణయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని సంకల్పించి ఈ మహాయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు సూచనల మేరకు రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో వరుణయాగాలు నిర్వహించాలని నిర్ణయించగా, అందులో భాగంగా భద్రాచలం దేవస్థానంలో ప్రత్యేక పూజలు, హోమాలతో ఈ యాగాన్ని నిర్వహించారు. యాగంలో భాగంగా చతుర్వేద మంత్రోచ్చారణల మధ్య నాలుగు కలశాలను ప్రతిష్ఠించి, వాటిలో వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ స్వరూపాలను ఆవాహన చేశారు. అనంతరం ఆయా దేవతల మూలమంత్రాలతో ప్రత్యేక హోమాలు నిర్వహించి, సంక్షేప రామాయణానికి వరుణ మంత్రాలను సంపుటీకరించి యాగక్రతువును పూర్తి చేశారు. హోమపూర్ణాహుతి అనంతరం పవిత్ర తీర్థంతో నింపిన కలశాల ద్వారా శ్రీ సీతారామచంద్రస్వామివారికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో కే. దామోదరరావు, ఆలయ ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాల కృష్ణమాచార్యులు, అమరవాది మురళీకృష్ణమాచార్యులు, కోటి శ్రీమన్నారాయణ ఆచార్యులు, పొడిచేటి సీతారామానుజాచార్యులు, వేదపండితులు, అర్చకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ సీతారామచంద్రస్వామివారి ఆశీర్వాదాలను పొందారు.

# సోలార్ విప్లవానికి బోనకల్ వేదిక

- ప్రతి ఇంటా సోలార్.. బోనకల్‌కు గ్రీన్ మిషన్
- సూర్యశక్తితో స్వర్ణ తెలంగాణ.. బోనకల్ నుంచే శ్రీకారం
- ఆగస్టు 15 నాటికి ఆదర్శ సోలార్ మండలంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశాలు
- 1,000 కోట్లతో 81 మోడల్ సోలార్ గ్రామాలు..
- 60 కోట్లతో విద్యుత్ మౌలిక వసతుల బలోపేతం
- "ప్రతి ఇంటినీ సోలరైజ్ చేద్దాం" - రెడ్కో ఎండీ ముషారఫ్ ఫరూఖీ




**ఖమ్మం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, జూలై 25:** తెలంగాణను దేశంలోనే గ్రీన్ ఎనర్జీ రాష్ట్రంగా నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక 81 మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమానికి ఖమ్మం జిల్లా బోనకల్ మండలం కేంద్రబిందువుగా మారుతోంది. ఆగస్టు 15 నాటికి బోనకల్ మండలాన్ని పూర్తిస్థాయి ఆదర్శ సోలార్ మండలంగా తీర్చిదిద్దాలని రెడ్కో వైస్ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం బోనకల్, గార్లపాడు, రావినూతల గ్రామాల్లో కొనసాగుతున్న సోలార్ రూఫ్‌టాప్, సోలార్ పంప్‌సెట్ పనులను రెడ్కో వైస్ చైర్మన్ ఎండీ ముషారఫ్ ఫరూఖీ, టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ ఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐఏఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతు వేదికలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులతో నిర్వహించిన అవగాహన సదస్సులో సోలార్ విస్తరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముషారఫ్ ఫరూఖీ మాట్లాడుతూ, "సౌర వనరులు అపరిమితం.. వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిది" అని అన్నారు. విద్యుత్ అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు వంటి సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించి, పర్యావరణహితమైన గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని విస్తృతంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 1,000 కోట్ల వ్యయంతో 81 గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేస్తోందని, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దిశానిర్దేశంలో తెలంగాణను లి"సోలార్ తెలంగాణ"లిగా తీర్చిదిద్దే కార్యాచరణ వేగంగా సాగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే కొండారెడ్డిపల్లి గ్రామాన్ని పూర్తిస్థాయి సోలార్ గ్రామంగా అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా కుటుంబాలు తమ విద్యుత్ అవసరాలను తీర్చుకోవడంతో పాటు అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి ఆర్థిక ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. అలాగే వ్యవసాయ క్షేత్రాల్లో సోలార్ పంప్‌సెట్ల వినియోగం రైతులకు విద్యుత్ వ్యయాన్ని తగ్గించి దీర్ఘకాలిక లాభాలను అందిస్తుందని వివరించారు. టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, బోనకల్ మండలంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ₹60 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. మూడు కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, రావినూతలలో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా బోనకల్‌ను రాష్ట్రానికి ఆదర్శ సోలార్ మండలంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ, "ప్రతి ఇంటినీ సోలరైజ్ చేయాలి" అనే లక్ష్యంతో ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానికంగానే సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవడం ద్వారా విద్యుత్ డిమాండ్‌ను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటునందించవచ్చని తెలిపారు. గ్రామస్థులు మోడల్ సోలార్ కార్యక్రమంలో చురుకుగా భాగస్వామ్యులై స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు గ్రామస్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలు, సోలార్ పంప్‌సెట్ల ప్రయోజనాలు, విద్యుత్ ఆదా, అదనపు ఆదాయం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. రెడ్కో, టీజీఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, జిల్లా అధికారులు, ప్రాజెక్టు అధికారులు, అమలు సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# భద్రాచలంలో భారీగా ఎండు గంజాయి పట్టివేత

- 101 కిలోల గంజాయి స్వాధీనం..
- నలుగురు అరెస్ట్.. ఎర్టిగా కారు సీజ్
- రూ.56 లక్షల విలువైన ఆస్తులు స్వాధీనం

**భద్రాచలం, జూలై 25 (ఆర్గాన్ న్యూస్):** భద్రాచలం ఎక్సైజ్ పోలీసులు భారీగా ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేశారు. శనివారం తెల్లవారుజామున కూనవరం రోడ్డులోని వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో నిర్వహించిన రూట్‌వాచ్‌లో ఈ పట్టివేత జరిగింది. ఉదయం సుమారు 2.30 గంటల సమయంలో అనుమానాస్పదంగా వేగంగా వెళ్తున్న జేఏ-03-ఎన్ఆర్-5892 నంబర్ గల ఎర్టిగా కారును ఎక్సైజ్ సిబ్బంది అడ్డగించి తనిఖీ చేయగా, కారులోని ఆరు బ్యాగుల్లో మొత్తం 101 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న ఐదు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో కర్ణాటకకు చెందిన సత్తిపాపా, అర్బాజ్ హుస్సేన్, గుల్జార్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజేంద్ర ప్రసాద్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో రూ.50.50 లక్షల విలువైన గంజాయి, రూ.50 వేల విలువైన ఐదు సెల్‌ఫోన్లు, రూ.5 లక్షల విలువైన ఎర్టిగా కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం స్వాధీనం చేసిన ఆస్తుల విలువ రూ.56 లక్షలు అని వెల్లడించారు. ఈ తనిఖీలు, స్వాధీనం ప్రక్రియను భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహీమున్నిసా ఆధ్వర్యంలో ఎస్సై సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ కరీం సీతారామ్, కానిస్టేబుళ్లు భద్రం, రాకేష్, రవికుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, డిప్యూటీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఏపీఈఎస్ ట్రైనీ అధికారులు నీలోఫర్ అజ్మీ, సుచితా భూపతి, లక్ష్మణ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


### కాలువలో స్నానానికి దిగి..

# ముగ్గురి మృతి

**రామచంద్రపురం :** సరదాగా కాలువలోకి దిగిన అక్కాచెల్లెళ్ల పిల్లలు ముగ్గురు మృత్యువాత పడిన విషాదమిది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలంలో ఈ ఘటన జరిగింది. బంధువుల కథనం ప్రకారం.. వెలంపాలేనికి చెందిన పోతుల మధు సాల్మాన్‌రాజుకు నలుగురు కుమార్తెలు. వీరందరికీ పెళ్లిళ్లయ్యాయి. తమ కుటుంబాలతో హైదరాబాద్‌లో ఉంటున్నారు. సాల్మాన్‌రాజు గతేడాది మృతిచెందారు. గురువారం సంవత్సరీకం కాగా, ఇటీవల పిల్లలతో సహా కుమార్తెలందరూ తల్లి గారింటికి వచ్చారు. శుక్రవారం అక్కాచెల్లెళ్ల పిల్లలు ఎనిమిది మంది కలసి చంద్రబాబునగర్ సమీపంలోని కాలువ వద్దకు వెళ్లారు. వేమన హర్షిత పావని(14) తొలుత స్నానం చేస్తూ నీళ్లలో మునిగిపోయింది. ఆమెను రక్షించే క్రమంలో కనికెళ్ల రంజిత్(15) కాలువలోకి దిగి కొట్టుకుపోయాడు. తర్వాత బొక్కే వీరేంద్ర(19) దిగి గల్లంతయ్యాడు. మిగతా పిల్లలు ఇంటికొచ్చి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ద్రాక్షారామ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లను పిలిపించి గాలించగా మృతదేహాలు లభ్యమయ్యాయి. మంత్రి వాసంశెట్టి సుభాష్ మృతుల కుటుంబాలను ఓదార్చారు.

# గురుపౌర్ణమి వేడుకల్లో ఆధ్యాత్మిక వైభవం

- శ్రీనివాస కళ్యాణంతో గాంధీచౌక్ షిర్డిసాయి మందిరం భక్తిరసమయం
- తొలి ఏకాదశి సందర్భంగా అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీనివాసుని కళ్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహణ
- సుమారు 1,500 మంది భక్తులతో కిటకిటలాడిన మందిరం
- సాయినాథుని అభిషేకం, ఆధ్యాత్మిక ప్రవచనాలతో మార్మోగిన ఆలయం



**ఖమ్మం త్రీ టౌన్, ఆర్గాన్ న్యూస్ , జూలై 25:** ఖమ్మం గాంధీచౌక్‌లోని వరప్రదాత షిర్డిసాయి మందిరం 16వ గురుపౌర్ణమి మహోత్సవాలు భక్తి పారవశ్యంతో కొనసాగుతున్నాయి. శనివారం ఐదవ రోజు నిర్వహించిన కార్యక్రమాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీనివాసుని కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించగా, ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం శ్రీ షిర్డి సాయినాథునికి తేనె, నెయ్యితో మహాభిషేకం నిర్వహించి, తులసీ దళాలతో విశేష అర్చనలు చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీ అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీనివాసుని దివ్య కళ్యాణం భక్తుల కనులపండువగా జరిగింది. ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను పరవశింపజేసింది. ఈ సందర్భంగా జ్ఞాన సరస్వతి పుట్టపర్తి చాగంటి శ్రీ వెంపల అన్నాజీ సాయిరాం ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసి, గురుభక్తి, దైవభక్తి, ధర్మాచరణతో జీవితం సార్థకమవుతుందని సందేశం అందించారు. భగవంతుని నామస్మరణ, సత్సంగం, సేవాభావం మనిషిని ఆధ్యాత్మిక ఉన్నతికి తీసుకెళ్తాయని వివరించారు. ఈ దివ్య కళ్యాణ మహోత్సవంలో వేములపల్లి వెంకటేశ్వరరావు దంపతులు, అర్వపల్లి నిరంజన్ దంపతులు, పొట్టి ప్రసాద్ దంపతులు, కురవేళ్ల జగన్ దంపతులు, కొల్లిపర రాము దంపతులు, గుండా ప్రణీత్ దంపతులు, వేల్పూరి సత్యనారాయణ దంపతులు, కాకరపర్తి సూర్యనారాయణ, డాక్టర్ వేములపల్లి నరేష్ దంపతులు, వేములపల్లి శ్రీనివాసరావు దంపతులు, గన్నవరపు నాగేశ్వరరావు దంపతులు, భువనగిరి ఉమేష్, శ్రీలమ్ హనుమంతరావు, నోముల శ్రీనివాస్, నూనె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 1,500 మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి శ్రీ అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీనివాసుని కళ్యాణ వైభవాన్ని తిలకించి స్వామివారి ఆశీర్వాదాలను పొందారు. గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల్లో భక్తి, విశ్వాసం, ధార్మిక చైతన్యాన్ని మరింత పెంపొందిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు.



# ఖమ్మంలో 'వాటర్ మ్యాజిక్స్' తొలి బ్రాంచ్

- టాలీవుడ్ నటులు శివకార్తీక్ దండ, కరుణ్ విజయ్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం
- ఇండోర్-అవుట్‌డోర్ వాటర్ ఫౌంటెన్లకు ఒకే చిరునామా
- నాణ్యత, మన్నికతో వినియోగదారుల మన్ననలు లక్ష్యం



**ఖమ్మం ఆర్గాన్ న్యూస్, జూలై 25:** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా తొలి 'వాటర్ మ్యాజిక్స్ ప్రైవేట్ లిమిటెడ్' బ్రాంచ్‌ను ఖమ్మం నగరంలో ఘనంగా ప్రారంభించారు. ఖమ్మం బైపాస్ రోడ్డులో విశాల్ మార్ట్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను టాలీవుడ్ ప్రముఖ నటులు శివాకార్తీక్ దండ (అఖండ, ఆచార్య, ఉగ్రం, శంబాల చిత్రాల నటుడు), కరుణ్ విజయ్ (100, పుష్ప, భోళా శంకర్ చిత్రాల నటుడు) ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా తొలి బ్రాంచ్‌ను ఖమ్మంలో ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వినియోగదారులు ఒకసారి వాటర్ మ్యాజిక్స్‌ను సందర్శించి అత్యాధునిక వాటర్ ఫౌంటెన్ల ప్రత్యేకతను స్వయంగా చూసి తమ అనుభూతిని పంచుకోవాలని కోరారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ రెడ్డి శ్యామల, ఖమ్మం డీలర్ వినోద్ రెడ్డి పొన్నగంట్ల మాట్లాడుతూ, 15 సంవత్సరాల అనుభవంతో అత్యుత్తమ నాణ్యత, ఎక్కువ కాలం మన్నిక, ఆకర్షణీయమైన డిజైన్లతో వివిధ రకాల వాటర్ ఫౌంటెన్లను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఇండోర్, అవుట్‌డోర్, గార్డెన్లు, ఫంక్షన్ హాళ్లు, పార్కులు, రిసార్టులు, కమర్షియల్ ప్రాంగణాలకు అనువైన అనేక మోడళ్లను వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ అమీర్‌పేటలో కార్పొరేట్ కార్యాలయం, తయారీ యూనిట్ ఉన్నట్లు పేర్కొంటూ, 15 సంవత్సరాలుగా వినియోగదారుల విశ్వాసంతో తయారీ సంస్థగా ఎదిగామని తెలిపారు. నాణ్యతే తమ విజయ రహస్యమని పేర్కొంటూ, ఖమ్మం ప్రజలు ఈ కొత్త బ్రాంచ్‌ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. "ఒక్కసారి వాటర్ మ్యాజిక్స్‌ను సందర్శించండి... మీ ఇంటికి, గార్డెన్‌కు, కార్యాలయానికి అందాన్ని, ఆహ్లాదాన్ని తీసుకొచ్చే ఆధునిక వాటర్ ఫౌంటెన్లను చూసి మీ అనుభూతిని పంచుకోండి" అని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

### డిఎస్సీపై వైసిపి పదేపదే అసత్య ఆరోపణలు

**మండిపడ్డ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**విశాఖపట్నం,జూలై 25:** ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేశ్‌పై వైసీపీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని మంత్రి మండిపడ్డారు. వైసీపీకి ఆరోపణలు చేయడం తప్ప ఆధారాలు చూపించే అలవాటు లేదని విమర్శించారు. తాడేపల్లిలో జగన్ ఇంటి సమీపంలోనే ఉండి లోకేశ్ డీఎస్సీపై సవాల్ విసిరారని, దానిపై స్పందించేందుకు జగన్ ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాలపై ఎలాంటి అనుమానాలు ఉన్నా చట్టబద్ధంగా విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా వివరాలు ఇచ్చినప్పటికీ వైసీపీ రాజకీయ దివాళాకోరుతనంతో విమర్శలు చేస్తోందని మంత్రి మండిపల్లి అన్నారు. తప్పుడు ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని సూచించారు. నిరాధార ఆరోపణలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వైసీపీ లక్ష్యమని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలు చేపట్టలేని వారు రాజకీయ రంగు పులిమి విమర్శలు చేయడం సరికాదని, ప్రజా సమస్యలపై చర్చించకుండా తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.



# నెలకొండపల్లిలో న్యాయ అవగాహన సదస్సు

## విద్యార్థులకు హక్కులు, బాధ్యతలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన

**నెలకొండపల్లి, జూలై 25,ఆర్గాన్ న్యూస్:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (ఖుహూ), ఖమ్మం ఆధ్వర్యంలో నెలకొండపల్లిలోని ఎవర్గ్రీన్ పాఠశాలలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి అఖిల గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు వారి హక్కులు, బాధ్యతలు, ప్రాథమిక విధులు, విద్యార్థుల హక్కులపై అవగాహన కల్పించారు. అలాగే గుడ్ టచ్–బ్యాడ్ టచ్, పోక్సో చట్టం ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, సోషల్ మీడియాకు బానిస కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కౌన్సిల్ అడ్వకేట్ కళ్యాణి విద్యార్థులకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించగా, కోర్టు సూపరింటెండెంట్ అరుణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నెలకొండపల్లి ఎస్సై పి. శ్రీనివాసరెడ్డి ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, యాజమాన్య ప్రతినిధులు ప్రగతి, భార్గవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంట మార్పిడితోనే రైతులకు మేలు

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, ఆర్గాన్ న్యూస్,జూలై.25 :** శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామానికి చెందిన గిరిజన రైతు బాదావత్ వీరన్న––బుజ్జి దంపతుల పొలంలో లిజిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పెసర విత్తనాలు వేసి పంట మార్పిడి విధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగుకు అవసరమైన సలహాలు అందించాలని ఆదేశించారు. వాతావరణ మార్పులు, అకాల వర్షాలు మరియు 'సూపర్ ఎల్–నినో' వల్ల ఏర్పడే వర్షాభావ పరిస్థితులను తట్టుకోవడానికి రైతులందరూ పంట మార్పిడి పద్ధతులను పాటించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. కేవలం వరి, మొక్కజొన్నలకే పరిమితం కాకుండా పప్పు దినుసులు, నూనె గింజలు ఆయిల్ పామ్, నువ్వులు), కూరగాయల సాగుపై దృష్టి సారించాలి. ప్రతి రైతు తమ భూమిని భాగాలుగా చేసి వివిధ రకాల ప్రత్యామ్నాయ పంటలు పండించాలన్నారు. జిల్లాలో నూతన ప్రాజెక్ట్ ద్వారా ప్రతి గ్రామంలో అన్ని రకాల పోషకాహార పంటలు పండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకంలోని యానిమల్ హెల్త్ క్లినిక్స్ సౌకర్యాన్ని ఉపయోగించి, కుక్కల మాదిరిగానే కోతులకు కూడా



'స్టెరిలైజేషన్' చేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని అన్నారు. అధిక యూరియా, పురుగుమందుల వాడకం వల్ల ఆహారంలో పోషకాలు తగ్గి పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోందని. రైతులు సామాజిక బాధ్యతతో ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ/ఆరోగ్యకరమైన పంటలను పండించాలి. తక్కువ రసాయనాలు వాడే రైతుల ఉత్పత్తులకు నగరాల్లో మంచి మార్కెటింగ్ కల్పిస్తామని అన్నారు. అవసరం లేని పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయడానికి వేల కోట్లు వెచ్చించే బదులు, ఆ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, మంచి పాఠశాలలు, కళాశాలలు నిర్మించుకోవచ్చని కలెక్టర్ అన్నారు. రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆలోచించి, ప్రభుత్వానికి సహకరిస్తూ లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కలెక్టర్ కోరారు. పంట మార్పిడి అవగాహన కార్యక్రమంలో భాగంగా భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి– భారతీయ ఉద్యాన పరిశోధన స్థానం, బెంగళూరు వారిచే రూపొందించబడిన నల్ల తామర పురుగులు తట్టుకునే అర్క తేజస్వి రకం విత్తనాలను రైతులకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ చేతి మీద పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. మధ్య తెలంగాణ మండలి జిల్లాలకు సంబంధించి మిరప సాగు గురించి పరిశోధనలు జరుపుతున్న ఉద్యాన పరిశోధన స్థానం, మల్యాల వారిచే ఈ రకాన్ని 2022 సంవత్సరం నుండి రైతుల క్షేత్రాలు లో సాగు చేయించి ఎకరానికి 40 క్వింటాల్ వరకు మిరప దిగుబడి సాధించడం జరిగింది. 2026 సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 250 ఎకరాలలో ఈ రకం విత్తనాన్ని రైతులకు పంపిణీ చేయడం జరుగుతుంది. ఈ విత్తనాల పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో డా.ప్రశాంత్ ప్రధాన శాస్త్రవేత్త, హెచ్ ఆర్ ఎస్ మల్యాల పాల్గొన్నారుఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, మరిపెడ వ్యవసాయ సహాయ సంచాలకులు మురళి, మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి, ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏ ప్రశాంత్ , కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ దిలీప్, ఉద్యాన శాస్త్రవేత్త ఎల్ సుహాసిని, వ్యవసాయ అధికారులు వీరా సింగ్, శ్రీదేవి, వ్యవసాయ విస్తరణ అధికారులు, సర్పంచ్ లచ్చుపతి, మరిపెడ మున్సిపల్ చైర్మన్, మండల అభివృద్ధి అధికారి, తాసిల్దార్, ఇరిగేషన్ అధికారులు, విద్యుత్ అధికారులు,ఉద్యాన అధికారులు శాంతిప్రియ పాల్గొన్నారు.




# అత్యాధునిక అంబులెన్స్ ప్రారంభించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్

**మహబూబాబాద్, ఆర్గాన్ న్యూస్, జూలై 25:** అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలను కాపాడేందుకు అత్యాధునిక గుండె రక్షణ, ఐసీయూ స్థాయి వైద్య పరికరాలతో కూడిన అంబులెన్స్‌ను వినియోగించుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి ఈసీఐఎల్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో అందించిన అత్యాధునిక అంబులెన్స్‌ను హుస్సేన్ నాయక్ ప్రారంభించారు. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల కింద రూ.60 లక్షల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలు కలిగిన అంబులెన్స్‌ను మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అందించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అంబులెన్స్‌లో అత్యవసర పరిస్థితుల్లో రోగులకు తక్షణ వైద్యసేవలు అందించేందుకు అవసరమైన ఐసీయూ స్థాయి పరికరాలు, అధునాతన గుండె రక్షణ వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మరో కోటి రూపాయల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమించడంతోనే మహబూబాబాద్ నియోజకవర్గానికి సీఎస్ఆర్ నిధులను తీసుకురాగలుగుతున్నానని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో కూడిన ఈ అంబులెన్స్ అందుబాటులోకి రావడంతో మహబూబాబాద్ జిల్లాలో అత్యవసర వైద్య సేవలు మరింత మెరుగుపడనున్నాయని వైద్యాధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఈసీఐఎల్ ప్రతినిధి ప్రతీక్ కుమార్ చక్రవర్తి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ వెంచర్‌కు అనుమతుల కోసమే అధికార పార్టీలో చేరారు

- కాల్వలను ఆక్రమించి డీటీసీపీ వెంచర్‌లో కలిపేశారు : సీపీఐ ఆరోపణ
- మున్సిపల్ కమిషనర్‌కు సీపీఐ ఫిర్యాదు

**ఖమ్మం రూరల్, జూలై 25 (ఆర్గాన్ న్యూస్):** వెంపటి రామకోటయ్య పేరుతో ఏర్పాటు చేసిన వెంచర్‌కు అనుమతులు పొందేందుకే వెంపటి సురేష్ అధికార పార్టీలో చేరారని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు చెరుకుపల్లి భాస్కర్ ఆరోపించారు. శనివారం ఎదులాపురం మున్సిపాలిటీ 29వ వార్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పంట కాల్వలను ఆక్రమించి వాటిని డీటీసీపీ వెంచర్‌లో కలిపేశారని ఆరోపించారు. అలాగే గ్రామ పంచాయతీ లేఅవుట్‌లో ఉన్న మూడు ప్లాట్లను కూడా అదే వెంచర్‌లో చేర్చారని పేర్కొన్నారు. వెంచర్‌కు అవసరమైన 60 అడుగుల రహదారి లేకపోయినా ఉన్నట్లు చూపించి అనుమతులు పొందేందుకు ప్రయత్నించారని, గత నాలుగేళ్లుగా అధికారులు అనుమతులు నిరాకరించినప్పటికీ ఇప్పుడు అధికారులను తప్పుదోవ పట్టించి టీఎల్పీ అనుమతులు పొందారని ఆరోపించారు. వెంటనే ఆ అనుమతులను రద్దు చేసి ఆక్రమించిన పంట కాలువను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వెంచర్‌కు దిగువ భాగంలో కాల్వలు యథాతథంగా ఉన్నప్పటికీ, వెంచర్ ప్రాంతంలో



మాత్రం అవి కనిపించకుండా పోయాయని భాస్కర్ అన్నారు. వెంచర్‌కు రేరా ఆమోదం పొందినట్లు ప్రచారం చేస్తున్నప్పటికీ, సంబంధిత రిజిస్ట్రేషన్ నంబర్‌ను ఎక్కడా ప్రదర్శించడం లేదని విమర్శించారు. ఇటువంటి వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసే ప్రజలు భవిష్యత్తులో నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే హైదరాబాద్‌లోని డీటీసీపీ, రేరా కార్యాలయాలకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం సీపీఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేసి, కాల్వల ఆక్రమణలు, వెంచర్ అనుమతుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, 28, 32 వార్డుల సీపీఐ కౌన్సిలర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, సీపీఐ నాయకులు వెన్నం భాస్కర్, వెంపటి రాము, మిరియాల నరుణ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.



# ఏటూరునాగారంలో శనివారం వారాంతపు సంత ప్రారంభం

## తొలి ఏకాదశి సందర్భంగా సంతకు శ్రీకారం

**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, జూలై 25:** ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజల చిరకాల స్వప్నమైన శనివారం వారాంతపు సంత తొలి ఏకాదశి సందర్భంగా అధికారికంగా ప్రారంభమైంది. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత సంతను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి కూరగాయల మార్కెట్ మీదుగా బోడ్రాయి వరకు, అక్కడి నుంచి చేపల మార్కెట్ వరకు ప్రతి శనివారం వారాంతపు సంత నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సంత ద్వారా రైతులు, చిరు వ్యాపారులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించే అవకాశం లభించడంతో పాటు, స్థానిక ప్రజలకు తాజా వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, రైతులు, వ్యాపారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంత ప్రారంభాన్ని విజయవంతం చేశారు.

# సమిష్టితత్వాన్ని ప్రోత్సహించటమే లక్ష్యం

- నేరుగా వరి విత్తితే అధిక దిగుబడులు
- రైతులకు నిపుణుల సూచనలు
- కారేపల్లిలో ఎఫ్‌పీఓ అవగాహన సదస్సు

**కారేపల్లి, జూలై 25 (ఆర్గాన్ న్యూస్):** సమిష్టి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించడం, చిన్న, సన్నకారు రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ సౌకర్యాలు అందించడమే రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) ప్రధాన లక్ష్యమని కోఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య తెలిపారు. శనివారం కారేపల్లి మండల కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ, కారేపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు దుగ్గినేని శ్రీనివాసరావు అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోలేక చిన్న, సన్నకారు రైతులు వెనుకబడుతున్నారని, దీంతో ఉత్పత్తి తగ్గి పెట్టుబడి వ్యయం పెరుగుతోందన్నారు. రైతులకు సాంకేతిక సేవలు, అవసరమైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేసిందన్నారు. సభ్యత్వం కోసం రైతులు రూ.2,000 చెల్లిస్తే, ప్రభుత్వం మరో రూ.2,000 వాటాగా జమ చేస్తుందని తెలిపారు. ఒక ఎఫ్‌పీఓలో 750 మంది సభ్యులను చేర్చుకునే అవకాశం ఉండగా, కారేపల్లి ఎఫ్‌పీఓలో ఇప్పటికే 400 మంది సభ్యులు




చేరి కార్యకలాపాలు ప్రారంభమైనట్లు చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కవిరాజ్ మాట్లాడుతూ, వరిని నేరుగా విత్తే పద్ధతిలో సాగు చేస్తే ఖర్చు, నీటి వినియోగం తగ్గడంతో పాటు అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ విధానంలో పంట కాలం సుమారు 15 రోజులు తగ్గుతుందని పేర్కొన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని, నేలలోని పోషక స్థితిని తెలుసుకుని ఎరువులు వినియోగించాలని సూచించారు. అనంతరం భూసార పరీక్షల విధానాన్ని వివరించి రైతులకు భూసార పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. సదస్సు ముగింపులో రైతులతో సమిష్టి వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీఓ డొమైన్ ఎక్స్‌పర్ట్ చావా అరుంధతి, సీఈవో బొల్లు హనుమంతరావు, దిశ కమిటీ సభ్యురాలు దారావత్ హేమలత బాలాజీ, సర్పంచ్‌లు అంగోత్ మత్రు, ఈసాల వెంకటేశ్వరరావు, భూక్య పద్మ, భూక్య రంజిత్ కుమార్, పూసం రామారావు, సొసైటీ డైరెక్టర్లు, రైతు ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.




# విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలవంచింది

- సీపీఎం డివిజన్ కార్యదర్శి బండి రమేష్
- కమ్యూనిస్టు కార్యకర్తలు సైద్ధాంతికంగా ఎదగాలి
  -- స్టడీ సర్కిల్ కన్వీనర్ షేక్ బషీరుద్దీన్

**ఎదులాపురం మున్సిపాలిటీ, జూలై 25 (ఆర్గాన్ న్యూస్):** ఢిల్లీలో జంతర్‌మంతర్‌లో జరిగిన విద్యార్థుల ఆందోళనతో పాటు దేశవ్యాప్తంగా సాగిన పోరాటాలకు కేంద్ర ప్రభుత్వం తలవంచిందని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ అన్నారు. పాలేరు డివిజన్ ఐదో స్టడీ సర్కిల్‌ను స్థానిక తమ్మినేని సుబ్బయ్య భవనంలో డివిజన్ నాయకుడు కొమ్ము శీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ ఘటనను ఖండిస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఉద్యమం విజయవంతమైందని అన్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో విద్యార్థులు పోరాడారని తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాట విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థుల మిగిలిన డిమాండ్లను కూడా కేంద్ర ప్రభుత్వం అంగీకరించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ, కమ్యూనిస్టు కార్యకర్తలు సైద్ధాంతికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం నిరంతర అధ్యయనం ఎంతో ముఖ్యమని, ప్రపంచ, దేశ, రాష్ట్ర, జిల్లా రాజకీయాలతో పాటు ప్రజల సమస్యలను కూడా లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు. "అధ్యయనం నుంచి పోరాటం, పోరాటం నుంచి అధ్యయనం" అనే స్ఫూర్తితో కమ్యూనిస్టు కార్యకర్తలు నిత్య విద్యార్థులుగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఊరటి సుదర్శన్ రెడ్డి, ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు, డివిజన్ నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, నందిగామ కృష్ణ, వర్షపొంగు వీరన్న, మల్లెపోయిన రాజశేఖర్, యాంటోని, పగిడిపల్లి వెంకట్రావు, నాగమణి, సుజాత, కుమ్మరికుంట్ల శ్రీనివాస్, కత్ర ఉపేందర్, గంగాధర్, కొండ వేణు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ ఉద్యమ ఫలితమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

## విద్యార్థి ఉద్యమ విజయానికి దేశవ్యాప్తంగా మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ అభినందనలు: కోయల నర్సింహారావు

**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, జూలై 25:** జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) నిర్వహణలో వెలుగుచూసిన ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ప్రజాసంఘాలు చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని తెలంగాణ ఏజెన్సీ దళితుల సేవా సంఘం (ఏడీఎస్ఎస్) ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కోయల నర్సింహారావు పేర్కొన్నారు. శనివారం



విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఈ పరిణామం ప్రజా ఉద్యమాల విజయానికి, విద్యార్థి శక్తికి నిదర్శనమని అన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ అధినేత అభిజిత్ నాయకత్వంలో సాగిన ఉద్యమానికి దేశవ్యాప్తంగా లభించిన మద్దతు ఈ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, సామాజిక సంస్థలు, స్వచ్ఛంద కార్యకర్తలు, మేధావులు, న్యాయవాదులు, మీడియా ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు కలిసికట్టుగా చేసిన పోరాటమే కేంద్ర ప్రభుత్వాన్ని నిర్ణయం తీసుకునేలా చేసిందని ఆయన అన్నారు. ఉద్యమానికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు, యువత ఐక్యంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిస్తే ఎంతటి ప్రభుత్వమైనా ప్రజల ఆకాంక్షలకు తలవంచాల్సిందేనని నర్సింహారావు వ్యాఖ్యానించారు. ప్రశ్నపత్రాల లీకేజీలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడాయని, ఇలాంటి ఘటనలు దేశ విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న విధానాలు పేదలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీల ఉన్నత విద్యావకాశాలను పరిమితం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సమగ్ర, పారదర్శక విచారణ జరిపించి, జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు, విద్యా వ్యవస్థలో పారదర్శకత నెలకొనే వరకు ప్రజా వ్యతిరేక, విద్యా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు కొనసాగుతాయని హెచ్చరించారు. విద్య హక్కును కాపాడడం ప్రతి ప్రజాస్వామ్య ప్రభుత్వ బాధ్యత అని, యువత భవిష్యత్తుతో రాజీ పడే విధానాలను దేశ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోరని కోయల నర్సింహారావు స్పష్టం చేశారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల అలసత్వం

## మధిర సెంట్రల్ డ్రైనేజీ పనులపై సీపీఎం తీవ్ర ఆగ్రహం

**ఆర్గాన్ న్యూస్ మధిర, జూలై 25:** మధిర మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన సెంట్రల్ డ్రైనేజీ పనులు తీవ్ర జాప్యంతో కొనసాగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సీపీఎం సీనియర్ నాయకులు శీలం నరసింహారావు, పట్టణ కార్యదర్శి పడకండి మురళి ఆరోపించారు. డిప్యూటీ సీఎం గెస్ట్ హౌస్ నుంచి ఆత్కూరు బైపాస్ రోడ్డు వరకు కొనసాగు తున్న సెంట్రల్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పనులు గత ఏడాదిన్నరగా నత్తనడకన సాగుతున్నాయని, తవ్విన రోడ్లను సకాలంలో పూడ్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గతంలో నిర్మించిన బలమైన రహదారులను తవ్వి ధ్వంసం చేసినప్పటికీ ఇప్పటివరకు ఏ ప్రాంతంలోనూ పనులు పూర్తికాలేదని, అధికారులు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా విస్మరించి పనులు కొనసాగుతున్నాయని, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యాన్ని అధికారు లు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిబంధనల ప్రకారం నాణ్యమైన పనులు పూర్తి చేయాలని, లేకపోతే భవిష్యత్తులో జరిగే నష్టాలకు అధికారులే బాధ్యత



వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మధిర అభివృద్ధి కోసం ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ, వాటి ఫలితాలు ప్రజలకు కనిపించడం లేదని, రోడ్లు, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వస తుల అభివృద్ధిలో ఆశించిన పురోగతి లేదని విమర్శించారు. సెంట్రల్ డ్రైనేజీ పనులను నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

# కాకర చేదు.. ప్రయోజనాలు ఎన్నో!

**అక్కినేపల్లి పురుషోత్తం రావు ఆర్గాన్ న్యూస్ ప్రతినిధి రంగారెడ్డి :**

**కాకర చేదుగాని ఆరోగ్యానికి చాలా మంచిది అంటారు. కాకరలో ఉండే పోషక విలువలు అనేకం. కాకర చేదుగా ఉన్నప్పటికీ ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. ఇందులో విటమిన్ సి అధికంగా ఉండటం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది ఇన్ఫెక్షన్లకు దూరంగా ఉంచుతుంది. కాకరకాయలోని ఫైబర్ జీర్ణ క్రియను మెరుగుపరిచి మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అలాగే అందులో ఉన్న విటమిన్ ఏ కళ్ళు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. చర్మాన్ని మెరుగు పరుస్తుంది. పుల్లెట్ ఐరన్ లాంటి పోషకాలు రక్తకణాల నిర్మాణానికి రక్తహీనతను తగ్గించడానికి ఉపయోగపడతాయి. అదనంగా పొటాషియం మెగ్నీషియం జింకు లాంటి ఖనిజాలు గుండె ఆరోగ్యానికి మెటబాలిజం హార్మోన్లు ఇన్ఫ్లమేషన్ నియంత్రించేందుకు సహాయపడతాయి వీటిలో ఉండే పాళీ టైర్లు రక్తంలో గ్లూకోజ్ ను నియంత్రించి డయాబెటిక్ అదుపులో ఉండేలా సహాయపడతాయి కాకరకాయలు ఉండేటప్పుడు చేదు తగ్గించడానికి వాటిలోని నీటిని పిండి వేస్తే ఈ ఆరోగ్య ప్రయోజనాలు అందించే పదార్థాలు వృథా అయిపోతాయి బాగా వేడి నూనెలో డీప్ ఫ్రై చేయడం వలన విటమిన్ సి యాంటీ ఆక్సిడెంట్లు మరింతగా తగ్గిపోతాయి అందుకే తక్కువ వీడియోలో ఆవిరిపై లేదా నీళ్లతో ఉడికించి కూరగా చేసుకుని తీసుకోవడం మేలు.**



కాకర ఇండియా అంతా పెద్దబడుతున్న ఒక చేదు తీగ జాతి మొక్క ఇది కుకుర్బీ టేసి కుటుంబానికి చెందింది. కాకర్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది ఇది అనేక వ్యాధులతో పోరాడడానికి గాయాలను మాన్పడానికి సహాయపడుతుంది అభివృద్ధి పెరుగుదలకు చాలా కీలకమైంది. కాకరకాయలో ఉండే విటమిన్ ఏ బిటాకోరిటిన్ మన కంటి ఆరోగ్యానికి మేలు చేసి దృష్టిని మెరుగుపరుస్తుంది. ఇవి కళ్ళ కింద నల్లటి వలయాలను రూపుమాపేందుకు సహకరిస్తుంది. కాకరకాయ పోషకాలు అధికంగా ఉండే కూరగాయ ఇది మధుమేహ నిర్వహణకు సహాయపడడంలో ఎంతో ఉపయోగపడుతుంది. ఇది రక్తంలోనే చక్కర స్థాయిలను తగ్గించడం ఇన్సూరెన్స్ సున్నితత్వాన్ని మెరుగుపరచడం ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడం అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంది.

### కాకరకాయ పెరుగుతో కలిపి తింటే?

ఇలా తినడం వలన జీర్ణక్రియ పై ప్రభావం పడుతుంది దీనివలన అసిడిటీ కడుపులో మంట వికారం కలిగే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. పెరుగు కాకరకాయ, పెరుగుబెండకాయ, విడివిడిగా ఆరోగ్యకరమైనవే అయినా అప్పటికి వీటిలో కలిపి తీసుకోవడం సరైనది కాదు ఈ కాంబినేషన్ వల్ల చర్మ సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఐరన్ స్థాయిలను పెంచడం ద్వారా రక్తహీనతను నివారిస్తుంది కాకరకాయ వలన కలిగే ప్రయోజనాలలో ఒకటి గర్భాధారణ సమయంలో ఐరన్ అధికంగా ఉండే ఆహార జాబితాలో చేర్చుకోవడం కాకర ఒక గొప్ప ఆహారం.

### కాకరకాయ తినడం వల్ల కలిగే అద్భుత ప్రయోజనాలు

బిట్టర్ గోల్డ్( కాకరకాయ) తెలుపు నుండి పారదర్శకమైన మాంసం ప్రత్యేక రుచిని కలిగి ఉండే ఒక ఆకుపచ్చ కూరగాయ ప్రజాదరణ పొందినప్పటికీ దీనిని ఆసియాలో ఎక్కువగా వినియోగిస్తున్నారు కాకరకాయలు విటమిన్లు మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. రోగ నిర్ధారణ వ్యవస్థలను బలపరుస్తుంది. చేదు ఉన్నప్పటికీ చేదు పోషకాలు ఆహార ప్రయోజనాలు పొంది ఉంది ఆరోగ్యకరమైన దంతాలు ఎముకలు రక్తకణాల నిరోధక వ్యవస్థ కండరాలు నరాలు మరియు మెదడుకు ఈ పోషకాలు అవసరం. క్యాన్సర్ ఫైటింగ్ లక్షణం కడుపు పెద్దప్రేగు ఊపిరితిత్తులు చేదు కాకరకాయ క్యాన్సర్ కణాలను చంపగలదని పరిశోధకులు చెబుతున్నారు ఇది నిర్దిష్ట రొమ్ము క్యాన్సర్ కణాలను నివారిస్తుంది. కాకరకాయ పోషకాలు అధికంగా ఉండే కూరగాయ ఇది రక్తంలో చక్కెర నియంత్రణ కాలేయాన్ని శుభ్రపరచడం రోగనిరోధక వ్యవస్థకు మద్దతు అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను వంట, మందులు, మరియు సౌందర్య సాధనాలలో ఉపయోగిస్తారు. మీ సాధారణ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మీ ఆహారంలో కాకరకాయ జోడించడం సహజమైన విధానం.

**రచన అక్కినేపల్లి పురుషోత్తమరావు ఆర్గాన్ న్యూస్ ప్రతినిధి రంగారెడ్డి**



## ప్రొఫెసర్ మల్లేశంకి అభినందనలు

**అభినందనలు అందజేసిన నవతెలంగాణ**
**రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుర్నగంటి రంజిత్ కుమార్**

**రంగారెడ్డి ప్రతినిధి ఆర్గాన్ న్యూస్ జూలై 25 :** వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం రిజిస్టర్ గా నియమితులైన ప్రొఫెసర్ జి. మల్లేశంని శనివారం నాడు నవ తెలంగాణ విద్యార్థి పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుర్న గంటి రంజిత్ కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు లభించిన ఈ నూతన బాధ్యత వారి విశిష్టమైన విద్య నాయకత్వానికి సమగ్ర పరిపాలన అనుభవానికి విశ్వవిద్యాలయ సమాజానికి అందించిన అంకితభవంతో కూడిన సేవలకు గుర్తింపుగా ఈ పదవి లభించిందని అన్నారు. ఈ నూతన బాధ్యతల్లో వారు మరిన్ని విజయాలు సాధించాలని వారి పదవీకాలం విద్యా ప్రగతి అభివృద్ధి అనేక విజయాలతో కొనసాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నవ తెలంగాణ విద్యార్థి పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ ఎన్ టివిపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ ఎన్ టివిపి నాయకు నగేష్ యాదవ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## తొలి ఏకాదశి సందర్భంగా కిటకిటలాడిన దేవాలయాలు

**రంగారెడ్డి ప్రతినిధి ఆర్గాన్ న్యూస్ జూలై 25 :** రంగారెడ్డి పరిధిలోని సంతోష్ నగర్ శ్రీ శ్రీ శ్రీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 108 కళశాల అభిషేకం కన్నుల పండుగ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు డాక్టర్ నల్లదిగా శ్రీనివాసాచార్యులు, నిర్వహించగా ఈ కార్యక్రమానికి దేవాలయ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ ధర్మకర్తలు నర్సింగరావు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా, అల్మాస్గూడ లోని న్యూ మధురాపురి కాలనీలో ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పెరుమాండ్ల నవీన్ కుమార్ రెడ్డి, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఇతర కాలనీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా షిరిడి నగర్ కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రధాన అర్చకులతో పాటు, కాలనీవాసులు రంగారావు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## ఉద్యమకారులను ఆదుకోండి

**డాక్టర్ యజ్ఞం పవన్ కుమార్ శర్మ**

**రంగారెడ్డి ప్రతినిధి ఆర్గాన్ న్యూస్ జూలై 25 :** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించండి వారిని ఆదుకోవాలి అని, తెలంగాణ బ్రాహ్మణఉద్యమ నేత యజ్ఞం పవన్ కుమార్ శర్మ నేతృత్వంలో కోరారు. ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా, సీనియర్ తెలంగాణ ఉద్యమ నాయకులు, ఐఐటి రామయ్య ఆశీస్సులతో ఏర్పడి తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో యజ్ఞం పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ తెలంగాణ సాధనలో వాళ్లు చేసిన త్యాగం పోరాటాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున వారికి తగిన సహాయ సహకారాలు అందించాలని, వినతి పత్రాలు అందజేయడం జరిగింది అని అన్నారు. అలాగే అన్ని కార్పొరేషన్లలో ముఖ్యంగా తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ లో కేవలం తెలంగాణ ఉద్యమకారులకు మాత్రమే పదవులు ఇవ్వాలని ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన వారికి పదవులు ఇస్తే ఊరుకునేది లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యజ్ఞం పవన్ కుమార్ శర్మ పోచంపల్లి రమణారావు నారప్ప రాజు రజిని ఊరే ప్రసాద్ రావు గూడా రాజేశ్వరరావు, గంప రామారావు శర్మ, గూడ జయరాం, మాజేటి వేణుగోపాల శర్మ తదితరులు పాల్గొన్నారు.



## పాలమూరు పులిబిడ్డ ఎర్ర సత్యం

**ఎర్ర సత్యం అన్న 69వ జయంతి సందర్భంగా నివాళులు**

**జడ్చర్ల ప్రతినిధి ఆర్గాన్ న్యూస్ జులై 25 :** జడ్చర్ల కేంద్రంలోని ఎన్ ఎన్ నేచర్ సిటీ అయోధ్య నగర్ రోడ్ నెంబర్ 4 లో గల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ గారి స్వగృహంలో ఎర్ర సత్యం అన్నగారి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం జడ్చర్ల కేంద్రంలోని ఎర్ర సత్యం మెమోరియల్ స్కూల్లో పిల్లలకు సంబంధించిన స్టేషనరీ ఐటమ్స్ ను పిల్లలకి అందజేయడం జరిగింది అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ మాట్లాడుతూ ఎర్ర సత్యం అన్న చేసిన సేవలను గుర్తు చేశారు అలాగే ఆయన చూపిన బాటలో నడుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్ర సత్యం అన్న అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

## విద్యార్థుల పోరాటానికి సీపీఐ(ఎం) అభినందనలు

- ప్రశ్నాపత్రాల లీకేజీలపై బాధ్యత వహించాల్సిందే
- ఎన్‌టీఏ రద్దు, ఎన్‌ఈపీ-2020 ఉపసంహరణకు మరోసారి డిమాండ్

**న్యూఢిల్లీ:** ప్రశ్నాపత్రాల లీకేజీలపై బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా పోరాడిన విద్యార్థులు, యువతకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్ బ్యూరో హృదయపూర్వక అభినందనలు తెలిపింది. విద్యార్థుల ఐక్య పోరాటం, అచంచల సంకల్పం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొంది. పొలిట్ బ్యూరో విడుదల చేసిన ప్రకటనలో, ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా 22 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత విషాదకరమని పేర్కొంది. ఆ ఘటనలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరుతూ జరిగిన ఉద్యమానికి దేశవ్యాప్తంగా ప్రజల వివిధ వర్గాలు, ప్రజాసంఘాలు అందించిన మద్దతు ఈ విజయానికి కారణమైందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు లాఠీచార్జీలు, నిర్బంధ చర్యలు, ఒత్తిళ్లు ఎదురైనా విద్యార్థులు వెనక్కి తగ్గకుండా పోరాటాన్ని కొనసాగించడం ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసిందని కొనియాడింది. యువత ప్రదర్శించిన ధైర్యం, త్యాగం, దృఢ సంకల్పం దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకు శుభసూచకమని పేర్కొంది. ప్రశ్నాపత్రాల లీకేజీల వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను సీపీఐ(ఎం) స్వాగతిస్తున్నట్లు తెలిపింది. అయితే, వరుసగా జరుగుతున్న లీకేజీలకు ప్రధాన బాధ్యురాలిగా పేర్కొంటున్న జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)ను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేసింది. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణను వికేంద్రీకరించి, రాష్ట్రాల భాగస్వామ్యంతో పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరింది. అదే విధంగా, వ్యాపారీకరణ, కేంద్రీకరణ, మతతత్వీకరణను ప్రోత్సహిస్తున్న జాతీయ విద్యా విధానం--2020 (ఎన్‌ఈపీ-2020)ను కూడా తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ విధానాలు కొనసాగినంతకాలం ప్రశ్నాపత్రాల లీకేజీలు, విద్యార్థులపై అన్యాయం, విద్యా అవకాశాల హరణ వంటి సమస్యలు పునరావృతమవుతూనే ఉంటాయని హెచ్చరించింది. విద్యార్థుల భవిష్యత్తు, పారదర్శక పరీక్షల వ్యవస్థ, సమాన విద్యా అవకాశాల కోసం విద్యార్థి, యువజన ఉద్యమాలు మరింత విస్తృతంగా ప్రచారం చేపట్టి, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలు కొనసాగించాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో పిలుపునిచ్చింది. మురళీధరన్ సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ కార్యాలయం తరఫున పత్రికా ప్రకటన విడుదల చేశారు.



## వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**కాపు కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేష్ పిలుపు**

**మేడ్చల్ :** వన మహోహత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేష్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ హెచ్ఎండిఏ - అర్బన్ ఫారెస్ట్ రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూకట్పల్లిలో శనివారం ప్రతి ఇంటికి ఉచితంగా ఐదు మొక్కలు (3 పండ్ల మొక్కలు ప్లస్ రెండు అలంకరణ, ఔషధ మొక్కలు) శనివారం పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాపు కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేష్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం ముఖ్య మంత్రి రాష్ట్రంలో 16 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ధారించారని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహిత్ గోపిడి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవంలో భాగంగా హెచ్ఎండిఏ - అర్బన్ ఫారెస్ట్రీ హైదరాబాదులో పచ్చదనాన్ని పెంచడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించటం, భూగర్భ జలాలను సంరక్షించడం, జీవ వైవిధ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నదన్నారు. కార్యక్రమంలో రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మందలపు సాయిబాబు చౌదరి, హెచ్ఎండిఏ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ చక్రపాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణీత్ కౌర్, రమేష్ పాల్గొన్నారు.

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే అమలు చేయాలి

- ఐద్వా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ సంతకాల సేకరణ
- కేంద్ర ప్రభుత్వానికి మహిళల గట్టి హెచ్చరిక



**ఖమ్మం, జూలై 25 (ఆర్గాన్ న్యూస్):** దేశవ్యాప్తంగా మహిళలు ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్‌ను ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం పాత బస్టాండ్ సెంటర్‌లో శనివారం విస్తృత స్థాయిలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు మాట్లాడుతూ, పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించినప్పటికీ, అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న మహిళలకు శాసనసభలు, పార్లమెంట్‌లో సముచిత ప్రాతినిధ్యం కల్పించకుండా కాలయాపన చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. రాజకీయ నిర్ణయాధికారంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలంటే 33 శాతం రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. మహిళల అభివృద్ధి, భద్రత, విద్య, ఉపాధి, ఆరోగ్యం వంటి అంశాలపై సమర్థవంతమైన విధానాలు రూపొందాలంటే శాసనసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాత బస్టాండ్ ప్రాంతంలో నిర్వహించిన సంతకాల సేకరణకు మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగినులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, సాధారణ ప్రజలు విశేష స్పందన చూపారని నిర్వాహకులు తెలిపారు. సేకరించిన సంతకాలను కేంద్ర ప్రభుత్వానికి, సంబంధిత ప్రజాప్రతినిధులకు పంపించి మహిళా రిజర్వేషన్ అమలుపై ఒత్తిడి తీసుకురానున్నట్లు వెల్లడించారు. మహిళల రాజకీయ సాధికారత కోసం అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే 33 శాతం రిజర్వేషన్ అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఖమ్మం జిల్లా కమిటీ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు, వివిధ వర్గాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.



## రాజాపూర్ కేజీబీవీలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

**విద్యార్థినులకు పాఠ్యపుస్తకాల పంపిణీ**

**రాజాపూర్ ప్రతినిధి ఆర్గాన్ న్యూస్ జులై 25 :** రాజాపూర్ మండల కేంద్రంలోని లికస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లిలో విద్యార్థినుల విద్యాభివృద్ధికి మరో ముందడుగు పడింది. స్థానిక ఎమ్మెల్యే తనయుడు ఇతిష్ రెడ్డి మరియు వారి స్నేహితుల సహకారంతో పాఠశాలలో నూతన కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు (టెక్ట్స్ బుక్స్) పంపిణీ చేశారు. విద్యార్థినులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారు ఆకాంక్షించారు. అలాగే స్థానిక జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి , సహకారంతో పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పాఠశాల భద్రతతో పాటు విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లా కలెక్టర్, ఖూఫ్నా గుప్తా, ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను దశలవారీగా సమకూరుస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కావాలి రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్ ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరియు పలువురు పాల్గొన్నారు.

రోజూ ఉదయం ఓ కప్పు పాలు తాగడం అనేది భారతీయ కుటుంబాల్లో అలవాటు. పిల్లల ఎదుగుదలకు, వృద్ధులు సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారంగా పాలను తీసుకుంటారు. కానీ, ఇప్పుడు అదే పాలు మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయి. మార్కెట్లో లభిస్తున్న పాలు ఎంతవరకు స్వచ్ఛమైనవో అనేది పెద్ద ప్రశ్నగా మారింది. వ్యాపారంలో అధిక లాభాల కోసం కొందరు పాల వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుతున్నారు. ఆవు లేదా గేదె నుంచి వచ్చిన సహజ పాలను నీటితో కలిపి ఎక్కువ లీటర్లుగా పెంచడం మొదటి దశ. దాంతో ఆ పాలు పల్చగా కనిపిస్తాయి. అలా కాకుండా కొంతమంది లాభాపేక్షపరులు దురాలోచనతో పాలను కల్తీచేసి విక్రయాలు చేస్తున్నారు. యూరియా, డిటర్జెంట్, ఫార్మాలిన్, వాషింగ్ సోడా వంటి రసాయనాలను కలుపుతూ కృతిమ పాలను సృష్టిస్తున్నారు. మార్కెట్లో చిక్కని పాలు ఎక్కువ ధరకు అమ్ముడవుతాయనే కారణంతో కొంతమంది పాల వ్యాపారులు ఈ ప్రయోగాలు చేసి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు.





- ప్రజా ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్న 'విషంపాలు'
- తెల్లగా కనిపించినవన్నీ నిజమైన పాలు కావు
- తాగే ముందు పరీక్షించండి.. తెలుసుకోండి !
- కల్తీపాలను తయారు చేస్తున్న పాల వ్యాపారులు
- యూరియా, డిటర్జెంట్, స్టార్చ్, ఫార్మాలిన్, వాషింగ్ సోడా వంటి రసాయనాలను కలుపుతూ కృతిమ పాల తయారీ

రోజూ ఉదయం కప్పు పాలు తాగడం అనేది మన భారతీయ కుటుంబాల్లో శతాబ్దాల నాటి అలవాటు. పిల్లల ఎదుగుదలకు, వృద్ధుల ఆరోగ్యానికి పాలు ప్రధాన పోషకాహారంగా భావిస్తారు. కానీ, ఇప్పుడు అదే పాలు మన ఆరోగ్యానికి శత్రువులుగా మారుతున్నాయి. మార్కెట్లో లభిస్తున్న పాలు ఎంతవరకు స్వచ్ఛమైనవో అనేది పెద్ద ప్రశ్నగా మారింది. ముఖ్యంగా తెల్లగా, మృదువుగా, తీపిగా కనిపించే పాలు... ఆరోగ్యానికి ప్రతీకగా మన రోజువారీ ఆహారంలో ముఖ్య స్థానాన్ని సంపాదించుకున్నాయి. కానీ అదే పాలు ఇప్పుడు మెల్లగా మన ఆరోగ్యాన్ని తినేస్తున్నాయని ఎప్పుడైనా ఆలోచించారా? కల్తీ పాలు అనే పేరు వెనుక దాగి ఉన్న ప్రమాదం ప్రతి ఇంటికి చేరుతోంది.

# పాలల్లో విషం!



## లాభాల కోసం మోసం :

మార్కెట్లో చిక్కని పాలు ఎక్కువ ధరకు అమ్ముడవుతాయనే కారణంతో కొంతమంది పాల వ్యాపారులు వింత ప్రయోగాలు చేస్తున్నారు. వారు మాల్టోడెక్సిన్ పౌడర్, పామ్ ఆయిల్, ఉప్పు లాంటి పదార్థాలను తక్కువ చిక్కదనమున్న పాలలో కలిపి గ్రైండర్లో మిక్సింగ్ చేస్తారు. ఈ ప్రక్రియతో పాలు స్వచ్ఛంగా కనిపిస్తూ, సహజ సుగంధం, చిక్కదనం కలిగినట్లు కనిపిస్తుంది. వాస్తవంగా డైరీలలో పాలలో క్వాలిటిని, చిక్కధనం పరిశీలన నిమిత్తం లాక్టోమీటర్ అనే పరికరంతో పాలు పరీక్షిస్తారు. ఈ మీటర్ ఎంత లోతుగా వెళ్తే అంత చిక్కదనం ఉన్నట్లు భావిస్తారు. కానీ కల్తీ పదార్థాలు కలిపిన పాలు కూడా ఈ పరీక్షలో కొన్నిసార్లు పాస్ అవ్వడంతో అసలు, నకిలీ పాలు మధ్య తేడా పట్టడం కష్టమవుతోంది.



## డిటర్జెంట్ పొడి :

పాలు నురుగుగా కనిపించేందుకు డిటర్జెంట్ పొడిని కలుపుతారు. ఫార్మాలిన్, పాలు త్వరగా పాడుకాకుండా ఉండేందుకు వాడతారు. ఇది మృతదేహ సంరక్షణ వాడే పదార్థం, ఇక స్టార్చ్ అనేది పాల మందం పెంచేందుకు పిండిపొడి వాడతారు. దీని వల్ల పేగు సంబంధిత వ్యాధులు తలెత్తుతాయి. ఇక పాలలో వాడే మరో రసాయనం వాషింగ్ సోడా పాల తెల్లదనం పెంచుతుంది. దీని ప్రభావం లివర్, కిడ్నీలపై తీవ్రంగా ఉంటుంది.

## ఇంజక్షన్ పాలు - హార్మోన్ల హానికర వాస్తవం

పశువులకు ఎక్కువ పాలు రావాలనే దురాశతో కొందరు ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు ఇస్తున్నారు. ఈ ఇంజక్షన్ వల్ల పాలలో మిగిలిన రసాయనాలు నేరుగా మన శరీరంలోకి చేరి కింది సమస్యలకు దారితీస్తాయి. చిన్న పిల్లల్లో హార్మోన్ల అసమ తుల్యత దెబ్బతింటుంది. ఇక మహిళల్లో మాసిక చక్రం లోపాలు, గర్భధారణ సమస్యలు, బాలింతల్లో పాల నాణ్యత తగ్గడం, శిశువుల్లో జీర్ణకోశ, పేగు సమస్యలు కలుగుతాయి.

## ఇంట్లోనే పాలను గుర్తించండి

- నురుగు పరీక్ష పాలను సీసాలో కదిలించండి. నురుగు ఎక్కువ సేపు ఉంటే ఆ పాలు కల్తీ.
- వేడి పాలలో కొన్ని చుక్కల నిమ్మరసం వేయండి. వెంటనే విరిగితే స్వచ్ఛమైన పాలు. ఆలస్యంగా విరిగితే సింథటిక్ కల్తీ పాలు.
- పాలలో అయోడిన్ చుక్కలు వేస్తే నీలం రంగు వస్తే స్టార్చ్ కలిపిన పాలు.
- పారదర్శక గ్లాసులో పాలు పోసి టార్చ్ వెలిగించండి. పాలు పారదర్శకంగా కనబడితే కల్తీ.



# 30 కోట్ల వ్యూస్..

## ఫిఫా రికార్డును బ్రేక్ చేసిన మోదీ వీడియో..

**న్యూఢిల్లీ :** భారత ప్రధాని నరేంద్ర మోదీ.. తాజాగా మరో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. నీట్ 2026 పరీక్షా పత్రాల లీకేజీ అంశంపై విద్యార్థులను ఉద్దేశించి ఆయన అర్ధరాత్రి వేళ పోస్ట్ చేసిన జెన్-జీ స్టైల్ సెల్ఫీ వీడియో నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ ఒక్క వీడియోతో ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు కేవలం 24 గంటల్లోనే దాదాపు వన్ మిలియన్ (10 లక్షల) మంది కొత్త ఫాలోవర్లు పెరిగారు. అలాగే.. ఆయన పోస్ట్ చేసిన ఈ ఇన్‌స్టా రీల్ కేవలం 24 గంటల్లోనే 303 మిలియన్ (దాదాపు 30.3 కోట్ల) వీక్షణలు సాధించి ప్రపంచ రికార్డు సృష్టించింది. 2026 ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్ కోసం చేసిన 'ఐషో స్పీడ్' వీడియో పేరిట ఉన్న 30 కోట్ల (300 మిలియన్లు) వ్యూస్ రికార్డును మోదీ వీడియో బీట్ చేసింది. ప్రస్తుతం ఇన్‌స్టాలో 100 మిలియన్ (10.2 కోట్ల) ఫాలోవర్లతో తొలి గ్లోబల్ లీడర్‌గా మోదీ అగ్రస్థానంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. మరోవైపు మోదీ అర్ధరాత్రి విడుదల చేసిన ఈ వీడియోపై రీల్స్‌కూడా నెట్టింట వైరల్ అవుతున్నాయి. 'ఫ్రెండ్స్' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ జెన్ జీ పరిభాషలో మాట్లాడడంతో అందరూ దీనిపై రీల్స్ చేస్తున్నారు. మోదీ అనుసరిస్తున్న ఈ సరికొత్త సోషల్ మీడియా ట్రెండ్ యువతను, ముఖ్యంగా జెన్-జీ తరాన్ని విశేషంగా ఆకట్టుకుంటోందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక ప్రశ్నపత్రాల లీక్‌లను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ గురువారం తాను విడుదల చేసిన వీడియోకు విద్యార్థుల నుంచి భారీ స్పందన రావడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. వారికి ధన్యవాదాలు తెలుపుతూ మరో వీడియోను విడుదల చేశారు. అంతకుముందు, మంత్రులందరూ సామాజిక మాధ్యమాల్లో క్రియాశీలకంగా ఉండాలని, యువతతో మమేకమవుతూ ముందుకు సాగాలని క్యాబినెట్ భేటీలో ప్రధాని సూచించారు.

# ఎన్‌డిఏలో ఇద్దరు రాజీనామా

## గతంలోనే వైదొలగిన ఎంజె అక్బర్

**న్యూఢిల్లీ, జులై 25 :** నీట్ పేపర్ లీకేజీపై కాక్రోచ్ జనతా పార్టీ, విద్యార్థిలోకం నిరసనల ధాటికి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. జంతర్ మంతర్ కేంద్రంగా దాదాపు నెల రోజుల పాటు అలుపెరగని పోరాటానికి.. యువతరం మొండిపట్టుదలకు ఎట్టకేలకు దిగొచ్చిన ప్రధాన్ శనివారం రిజైన్ చేశారు. గత ఎనిమిదేళ్లలో ఇలా పదవీకాలం మధ్యలోనే వైదొలిగిన ఏకైక కేంద్ర మంత్రి ప్రధానే కావడం విశేషం. 2018లో విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్ అనూహ్యంగా రాజీనామా సమర్పించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థిలోకం శాంతించింది. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాన్ స్వచ్ఛందంగా వైదొలగడంతో కాక్రోచ్ జనతా పార్టీ నేతలు ఉద్యమాన్ని విరమించారు. అయి-ంతే.. గత ఎనిమిదేళ్లలో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన ఏకైక వ్యక్తి ధర్మేంద్ర ప్రధాన్. అయన కంటే ముందు.. 2018లో అనూహ్య పరిణామాల మధ్య ఎంజే అక్బర్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి బాధ్యతల నుంచి వైదొలిగారు. నరేంద్ర మోడీ క్యాబినెట్‌లో మంత్రిగా 2016లో బాధ్యతలు చేపట్టిన అక్బర్.. అంతుకుముందు వార్త పత్రిక ఎడిటర్‌గా ఉన్న సమయంలో పలు మహిళలపై లైంగిక వేధింపులు పాల్పడ్డాడనే ఆరోపణలు వచ్చాయి. ఆయనకు వ్యతిరేకంగా మీటూ ఉద్యమం తీవ్రమవ్వడంతో అక్బర్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈసారి నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై విద్యార్థులు భగ్గుమనడంతో.. ప్రధాన్ రాజీనామా అనివార్యమైంది. అయితే.. 2017లో రాజ్‌నాథ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ మాది యూపీఏ ప్రభుత్వం కాదు మంత్రులు రాజీనామా చేయడానికి అని నవ్వుతూ జవాబిచ్చాడు. కట్ చేస్తే తొమ్మిదేళ్లకు ఎన్డేఏ మంత్రివర్గంలోని ధర్మేంద్ర ప్రధాన్ అనూహ్య పరిణామాలతో వైదొలగాల్సి వచ్చింది.

# మోదీ మొండి వైఖరికి దక్కిన ఓటమి

## కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



**న్యూఢిల్లీ, జులై 25 :** ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై తాజాగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. దేశంలోని విద్యార్థుల గొంతుక ఎట్టకేలకు అహంకార పూరిత ప్రభుత్వ గడపను తాకిందని ఖర్గే వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థ ప్రక్షాళనను కోరుతూ దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత సాధించిన విజయమిదని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఇది సత్యానికి లభించిన విజయమని, ప్రధాని మోదీ మొండి వైఖరికి దక్కిన ఓటమి అని వ్యాఖ్యానించారు. అవినీతిమయమైన ఈ ప్రభుత్వం కారణంగా నష్టపోయిన కుటుంబాలు అన్నింటిదీ ఈ విజయమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పార్లమెంటు నుంచి వీధుల వరకు ఏకతాటిపై నిలిచి పోరాడిన ప్రతిపక్షాల ఐక్యతే ఈ విజయానికి కారణమని ఆయన స్పష్టంచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతరానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నటి ప్రియాంక చోప్రా సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. విద్యార్థుల పోరాటాన్ని ప్రస్తావిస్తూ.. ఇది తమ డిమాండ్ల కోసం దృఢంగా నిలబడి నిరసన తెలిపిన యువతకు, ప్రజాస్వామ్యానికి దక్కిన భారీ విజయమని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్టు క్షణాల్లో వైరల్ కాగా దీనిపై ప్రియాంక చోప్రా స్పందిస్తూ 'నమస్కారం', 'లవ్' ఎమోజీలను జతచేసి తన మద్దతు చాటారు.

# నేటి తరం యువత ఆలోచనాపరులు

### వారిని అర్థం చేసుకుని ప్రేమగా చర్చించాలి
### ఆదేశాలతో కాదు.. అర్థవంతమైన చర్చలతో సాగాలి
### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ, జులై 25 :** నేటితరం యువత ఆలోచనాపరులని, వారిని అర్థం చేసుకుని ముందుకు సాగాల్సి ఉందని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ నేటి యువతపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి తరం మార్గదర్శకత్వం లేనిదో లేదా దారి తప్పినదో కాదని స్పష్టం చేశారు. వారిని అర్థం చేసుకోవడానికి ఆదేశాలు ఇవ్వడం కాకుండా అర్థవంతమైన చర్చలు జరపాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఢిల్లీ వీధుల్లో విద్యార్థుల నిరసనలతో వాతావరణం అత్యంత వేడెక్కిన తరుణంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 'విశ్వ మాంగల్య సభ' కార్యక్రమంలో మాట్లాడిన మోహన్ భగవత్ తరాల మధ్య పెరుగుతున్న వ్యత్యాసాన్ని ప్రస్తావించారు. 'మేము యువకులుగా ఉన్నప్పుడు విధేయత చూపించే వాళ్లం. కానీ ఇప్పుడు పరిస్థితులు అలా లేవు. నేటి తరం ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉంది. కాబట్టి మనం వారికి ప్రతి విషయాన్ని కారణాలతో సహా వివరించాల్సి ఉంటుంది. వారిపై ఎనలేని ప్రేమను చూపిస్తూ, వారితో సమయం గడపాలి. కుటుంబాల్లో సంభాషణలు తగ్గిపోతుండటం ఆందోళనకరం. యువత నమ్మకాన్ని గెలవాలంటే హుకుం జారీ చేయడం కాదు, వారితో మాట్లాడాలి. వారికి ఓ ఆత్మీయ భావన కలిగించాలి. ఆదేశాలు జారీ చేయడం కాకుండా చర్చలు జరిపి, ఒక ఏకాభిప్రాయానికి రావడం ముఖ్యం అని భగవత్ పిలుపునిచ్చారు. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనల గురించి భగవత్ ప్రత్యక్షంగా ఎలాంటి ప్రస్తావన చేయకపోయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇతర రాష్ట్రాలకు కూడా పాకిన ఈ సీజేపీ నిరసనలపై ఆయన ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ముఖ్యంగా జూలై 20న పార్లమెంట్ సమీపంలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య జరిగిన తీవ్ర ఘర్షణలు ప్రజా ఆగ్రహాన్ని మరింత పెంచాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. మోహన్ భగవత్ గారు, జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న పరిణామాలపై గత నెల రోజులుగా మీరు పాటిస్తున్న మౌనం మీ ఉపన్యాసాల కంటే చాలా శక్తివంతంగా ఉందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ నిరసనల మధ్య ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్తతరం ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తోందని, యువతకు సమాధానం ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. కొత్తతరంతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడిపి వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పులను, యువత ఆలోచనా విధానాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. నేటి కాలంలో ప్రతీది మొబైల్‌లోనే నిక్షిప్తమై ఉందన్నారు. నేటి కుటుంబాల్లోనూ పరస్పర సంభాషణలు తగ్గిపోతున్నాయిని మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలతో మరింత ఆప్యాయంగా మెలగాలని, వారి కోసం సమయం కేటాయించి మాట్లాడాలని ఆయన హితవుపలికారు. ప్రస్తుతం కొత్తతరం ప్రతి అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతోందని, వారికి కేవలం ఆదేశాలు ఇవ్వడం కాకుండా తగిన కారణాలను వివరించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని అభిప్రాయపడ్డారు. విదేశీ దండయాత్రలు, బ్రిటీష్ పాలన వల్ల భారత ప్రజల ఆలోచనా ధోరణి పూర్తిగా మారిపోయిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ అన్నారు. బ్రిటీష్ పాలన వల్ల మన సాంప్రదాయాలు తప్పని, విదేశీ పద్ధతులే సరైనవనే భావన భారతీయుల్లో పెరిగిందని వ్యాఖ్యానించారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. టెక్నాలజీని మానవాళి శ్రేయస్సు కోసం వాడుకోవాలని సూచించారు. అపరిమితమైన కోరికలు, భౌతికవాదం సమాజంలో పోటీని, సంఘర్షణలను పెంచుతాయని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హెచ్చరించారు.

## ధర్మేంద్ర రాజీనామాతో

# జంతర్‌మంతర్ వద్ద ఉద్రిక్తత

### మరోమారు రెచ్చిపోయి పోలీసులపై రాళ్ల దాడి
### ఇద్దరు పోలీసులకు తీవ్ర గాయాలు
### సంబరాల్లో మునిగిపోయిన విద్యార్థులు



**న్యూఢిల్లీ, జులై 25 :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించిన వెంటనే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. నిరసనకారులు పోలీసులపై రాళ్ల దాడికి దిగారు. నిరసనకారుల రాళ్లదాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. వారి తలలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ పోలీసులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. ఈ నేపథ్యంలోనే జంతర్ మంతర్ వద్ద అదనపు బలగాలు మోహరించాయి. ప్రస్తుతం అక్కడి పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు సమాచారం. మరోవైపు విద్యార్థులు సంబరాల్లో మునిగిపోయారు. అభిజీత్‌ను అభినందిస్తూ భుజాలపైకి ఎత్తుకున్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, విద్యార్థులు సాధించిన విజయంగా పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కొన్ని వారాలుగా కొనసాగిన నిరసనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా విద్యార్థులు ఒత్తిడి తెచ్చారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, దేశవ్యా ప్తంగా ఉన్న విద్యార్థుల సామూహిక సంకల్పానికి లభించిన విజయమని ఆయన అభివర్ణించారు. కాగా, నిరంతర శాంతి యుత నిరసనలు మార్పును తీసుకురాగలవని చెప్పడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక నిదర్శనమని అభిజీత్ దిప్కే తెలిపారు. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మీరు భయపడకపోతే, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే, మనం ఎవరితోనైనా రాజీనామా చేయించగలమని చెప్పడానికి ఇది నిదర్శనం' అని అన్నారు. అలాగే నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల పేర్లను దిప్కే గుర్తు చేసుకున్నారు. వారి స్మృతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని నిరసనకారులను కోరారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిరసన ప్రాంగణంలో విద్యార్థు ల సంబరాలు హోరెత్తాయి. విద్యావ్యవస్థపై లోపాలను ఎత్తిచూ పుతూ పుట్టుకొచ్చిన పార్టీనే సీజేపీ సరిగ్గా రెండు నెలల క్రితం అభిజీత్ దీప్కే దీనిని ఏర్పాటు చేశారు. కొన్ని గంటల్లోనే ఇంటర్నెట్‌లో దాని పేరు మార్మోగిపోయింది. తర్వాత నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో దీప్కే జంతర్ మంతర్ వద్ద ప్రారంభించిన నిరసనలకు భారీ సంఖ్యలో యువత స్పందించింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నిరసన వేదికవద్దకు వచ్చి మద్దతు తెలిపారు. జులై 20న 'చలో పార్లమెంట్' మార్చ్, ప్రధాన్ రాజీనామా నుంచి సీజేపీ వెనక్కి తగ్గకపోవడంతో ప్రభుత్వం దిగిరావాల్సి వచ్చింది. ఈ పరిణామాల్లో కీలకంగా వ్యవహరించిన 30 ఏళ్ల దీప్కే.. మహారాష్ట్రలోని పుణెలో జర్నలిజం చదివారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చేశారు.

# సామాన్యుడిలా ప్రజల మధ్యే ఉంటా

- సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం
- వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుందాం
- ఆస్పరిలో సంజీవిని పథకం ప్రారంభించిన సిఎం చంద్రబాబు



**కర్నూలు, జులై 25 :** తాను సచివాలయానికే పరిమితం కాకుండా సామాన్యుడిలా ప్రజల మధ్యలోనే ఉంటానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లాలోని ఆస్పరిలో సీఎం చంద్రబాబు పర్యటించి 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లను క్రమం తప్పకుండా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేదరికాన్ని నిర్మూలించడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించిన సీఎం.. వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుంటే ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం ఉండదని హితవు పలికారు. సాంకేతికతను జోడిస్తూ 'ఏఐ డాక్టర్' సేవలను అందుబాటులోకి తెచ్చి, ప్రతి ఒక్కరి హెల్త్ డిజిటలైజ్ చేస్తామని వెల్లడించారు. అలాగే భూ హక్కులకు భద్రత కల్పించేందుకు 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆలోచించి పంటలు వేయాలని విజ్ఞప్తి చేస్తూనే, ఆలూరు ప్రాంతంలో తాగునీరు, రోడ్ల సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రాయలసీమ సస్యశ్యామలానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించిన చంద్రబాబు, వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తరలిస్తామని హామీ ఇచ్చారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును, 2028 నాటికి రాయలసీమ స్టీల్ ఫ్యాక్టరీని పూర్తి చేస్తామని స్పష్టమైన గడువు విధించారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# హౌజింగ్ కార్పోరేషన్ కీలక నిర్ణయం

## మూడు రోజుల గ్రాస్ సాలరీ వసూలు నిలిపివేత

**అమరావతి, జులై 25 :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కీలక నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల కోసం మూడు రోజుల గ్రాస్ శాలరీని వసూలు చేయాలంటూ జారీ చేసిన ఉత్తర్వులను సంస్థ యాజమాన్యం పూర్తిగా రద్దు చేసింది. ఈ మేరకు జులై 16న జారీ చేసిన మెమోను రద్దు చేస్తూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి. అరుణ్ బాబు తాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల ముందస్తు అనుమతి లేకుండానే జీతం కోత ప్రతిపాదించడం సరైంది కాదని గుర్తించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెమోలో పేర్కొన్నారు. అలాగే, మూడు రోజుల జీతాన్ని ఉద్యోగుల సంక్షేమ నిధికి జమ చేయాలన్న ఆదేశాలు పూర్తిగా రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. జీతం కోతకు సంబంధించిన అన్ని ఉత్తర్వులు తక్షణమే అమలు కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ అధికారులకు ఎండీ ఆదేశాలు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఎండీ పి. అరుణ్ బాబు ఆదేశాలు జారీ చేశారు.



# విద్యార్థులే నిజమైన దేశభక్తులు

## ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ : రాహుల్, ప్రియాంకల హర్షం

**న్యూఢిల్లీ,జులై 25 :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ చెబుతూ, వారే నిజమైన దేశభక్తులని కొనియాడారు. విద్యార్థులు తమ హక్కుల కోసం, పారదర్శకమైన విద్యా వ్యవస్థ కోసం చేసిన పోరాటం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని రాహుల్ పేర్కొన్నారు. వారి ఐక్యత, పట్టుదల చూస్తే గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఈ పరిణామం విద్యా రంగంలో సంస్కరణలకు దారి తీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'విద్యార్థులపై ఎవరైతే దాడి చేసి, వారిని కొట్టి, వారిపై కాల్పులు జరిపారో, వారందరికీ శిక్ష పడాల్సిందే. ఈ విషయాన్ని ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నాను' అని రాహుల్ పేర్కొన్నారు. అలాగే, దేశ విద్యార్థుల గౌరవం, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భారత ప్రధానమంత్రి దాడులకు గురైన విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ సూచించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమమని, యువత తమ గళాన్ని వినిపించి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పిందని అన్నారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు చేసిన పోరాటం ఫలించిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఇది కోట్లాది మంది విద్యార్థుల విజయమని తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారని, వారి పోరాటం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో

# మారుతున్న పరిణామాలు

- ఢిల్లీ నుంచి మహా సిఎం ఫడ్నవీస్‌కు పిలుపు
- మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాలు

**న్యూఢిల్లీ, జులై 25 :** మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో న్యూఢిల్లీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఢిల్లీ రావాలని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం షిండేకు కూడా ఢిల్లీ పెద్దల నుంచి పిలుపు వచ్చింది. కీలక నేతలకు హైకమాండ్ నుంచి పిలుపు రావటంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరువాత న్యూఢిల్లీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఢిల్లీకి రావాలని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం షిండేకు కూడా ఢిల్లీ పెద్దల నుంచి పిలుపు వచ్చింది. కీలక నేతలకు హైకమాండ్ పిలుపుతో రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. కేంద్రం భారీ మార్పులకు సిద్ధం అవుతోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ దిశగా శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర లో సీఎం మార్పు జరుగబోతోందని అన్నారు. ఫడణవీస్‌కు కేంద్ర విద్యాశాఖను ఇవ్వబోతున్నారని చెప్పారు. కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ కొంత కాలంగా వాయిదా పడుతున్న విషయం తెలిసిందే. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తి చేయాలని కేంద్రం భావించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ప్రధాని విదేశీ పర్యటనల కారణంగా ఈ ప్రక్రియ కొంతకాలం పాటు వాయిదా పడినట్టు సమాచారం. ఇక పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ప్రధాన్ సహా ఇతర మంత్రులు తప్పుకునే అవకాశం ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ఈలోపు విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. విపక్షలా నిరసనల నేపథ్యంలో గత కొన్ని రోజులుగా పార్లమెంటు కూడా ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదా పడుతోంది. తాజాగా విద్యాశాఖ మంత్రి తప్పుకోవడంతో ఆ శాఖ ఎవరికి కేటాయిస్తారన్న ఉత్కంఠ మొదలైంది. ఇతర ప్రభుత్వ శాఖల విషయంలో ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటుందా అన్న చర్చ జరుగుతోంది. నిన్న రాత్రి కేంద్రం 12 శాఖల సెక్రటరీలకు స్థాన చలనం కలిగించింది. వారిలో విద్యాశాఖ సెక్రటరీ కూడా ఉన్నారు. దీంతో, మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కేంద్రం పూర్తిస్థాయి దృష్టి పెట్టనుందా? అన్న చర్చ జరుగుతోంది.

## గ్లోబల్ మార్కెట్‌ల్లో నథింగ్ మూతపడుతోందా?




కొన్ని రోజుల్లో ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ నథింగ్.. ప్రపంచవ్యాప్తంగా డజన్‌కు పైగా మార్కెట్లలో మూతపడుతున్నట్లు కొన్ని టెక్ నివేదికలు చేస్తున్న ప్రచారాన్ని కంపెనీ ఖండించింది. మరోవైపు, 40 శాతం ఉద్యోగాల కోత చేపట్టనున్నట్లు వస్తున్న వార్తలను తోసిపుచ్చింది. దీనిపై నథింగ్ సహ వ్యవస్థాపకుడు అకిస్ ఎవాంజెలిడిస్ స్పందించారు. అవన్నీ తప్పుడు కథనాలని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. "జపాన్, యూరప్ వంటి పలు గ్లోబల్ మార్కెట్ల నుంచి నథింగ్ వైదొలుగుతున్నట్లు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. అవన్నీ వదంతులే. ఏ మార్కెట్ నుంచి కంపెనీ తప్పుకోవడం లేదు. తదుపరి వృద్ధికి కంపెనీ బృందాలను పునర్నిర్మిస్తున్నాం. ప్రత్యేకంగా ఒక ఏఐ నేటివ్ వ్యాపార యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నాం. ప్రాంతీయ హబ్‌లు మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ మార్పుల్లో భాగంగా కొన్ని ఉద్యోగ స్థాయిలపై ఆ ప్రభావం పడుతుందన్న మాట వాస్తవమే. నిబంధనల ప్రకారం వాటి వివరాలను ప్రస్తుతానికి వెల్లడించలేం" అని ఆయన అన్నారు. కంపనీ తదుపరి యుగాన్ని తీర్చిదిద్దేందుకు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని అకిస్ ఎవాంజెలిడిస్ తెలిపారు. టెక్ నివేదికలు పేర్కొన్న స్థాయిలో ఉద్యోగాల తొలగింపులు ఉండబోవని స్పష్టం చేశారు. పరిమిత స్థాయిలోనే ఉద్యోగ కోతలు ఉంటాయని, ప్రభావితమైన సిబ్బందికి అన్ని విధాల అండగా ఉంటామని వెల్లడించారు. మరోవైపు నథింగ్ ఫోన్4(బీ) విక్రయాలు తగ్గినట్టు వస్తున్న వార్తలపై స్పందించారు. విడుదలైన మొదటి రోజే 29,537 యూనిట్లు విక్రయాలు జరిపి, ఆ ధరల సెగ్మెంట్‌లో నథింగ్ ఫోన్4(బీ) రికార్డు సృష్టించిందన్నారు.



# బిజినెస్



## ఏఐ రంగంపై ప్రజలకు నమ్మకం పోతోంది : సత్యనాదెళ్ల

**న్యూయార్క్, జులై 25 :** ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగంపై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు. ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధను వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకతకు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.



## స్మార్ట్‌ఫోన్లు మరింత భారం..

### ప్రాసెసర్ ధరలు పెంచనున్న క్వాల్‌కామ్

ప్రముఖ కంపెనీలు ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతుండటంతో సెమికండక్టర్ విభాగానికి డిమాండ్ పెరుగుతోంది. అదే స్థాయిలో మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు తడిసి మోపెడవుతోంది. దీంతో ప్రపంచ టెక్ కంపెనీలు తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. యాపిల్, శాంసంగ్ వంటి పలు కంపెనీలు ఇప్పటికే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలను పెంచేశాయి. ప్రపంచంలోనే నంబర్‌వన్ చిప్ తయారీ సంస్థ తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ (టీఎస్ఎంసీ) కూడా చిప్ ధరలను పెంచేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కస్టమర్‌గా ఉన్న శాన్‌డియోగో కంపెనీ క్వాల్‌కామ్ కూడా తన ప్రాసెసర్ ధరలను రెండంకెల శాతానికి పెంచుతుండటం గమనార్హం! దీంతో స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ల ధరలు మరింత ప్రియమయ్యే అవకాశం ఉంది. వ్యయ ధరల పెరుగుదల కారణంగా క్వాల్‌కామ్ తన ప్రాసెసర్ ధరలను పెంచనున్నట్లు కొన్ని అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి. సెప్టెంబర్ 1 నుంచి ఈ పెంపు అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఖర్చుల భారాన్ని ఇకపై మోయలేమని కంపెనీ పేర్కొన్నట్లు సమాచారం. ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై క్వాల్‌కామ్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్ ధరలు మండిపోతున్నాయి. క్రమంగా టీఎస్ఎంసీ, క్వాల్‌కామ్ కూడా తమ ఉత్పత్తుల ధరలను పెంచితే ఫోన్లు, ల్యాప్‌టాప్ ధరలు మరింత భారంగా మారనున్నాయి. కాగా, శాంసంగ్, షావోమి, వన్‌ప్లస్, మోటోరోలా వంటి పలు కంపెనీలకు క్వాల్‌కామ్ తన ఉత్పత్తులను సరఫరా చేస్తోంది.



## మారుతీ బ్రెజాలో కొత్త వెర్షన్

మారుతీ సుజుకీ ఇండియా తన ఎస్‌యూవీ మోడల్ బ్రెజాలో కొత్త వెర్షన్‌ను తీసుకొచ్చింది. దీని పరిచయ ధర రూ.7.4 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. సరికొత్త 1.0 లీటర్ డైరెక్ట్ ఇంజెక్షన్ టర్బో పెట్రోల్ ఇంజిన్, ప్రాచుర్యం పొందిన 1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌లతో 6 స్పీడ్ మ్యాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో పాటు 6 స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌తోనూ ఈ కారు లభ్యమవుతుంది. సీఎన్‌జీ వెర్షన్‌కూ ఇదే ఇంజిన్ ఉంటుంది. 16 అంగుళాల డ్యూయల్ టోన్ అల్లాయ్ వీల్స్, 360 డిగ్రీల కెమేరా వంటి ఫీచర్లు ఈ కారుకు ఉన్నాయి. తమ అమ్మకాలు పెరిగేందుకు ఈ ఎస్‌యూవీ దోహదపడుతుందని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి (మార్కెటింగ్, విక్రయాలు) పార్థో బెనర్జీ తెలిపారు. పాత, కొత్త మోడళ్ల అండతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్పోర్ట్స్ వినియోగ వాహనాల (ఎస్‌యూవీ) విక్రయాల్లో 25–30% వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో 5.5 లక్షల ఎస్‌యూవీలను విక్రయించగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7 లక్షల ఎస్‌యూవీల విక్రయాలను అంచనా వేస్తున్నామని తెలిపారు. '2022–23లో మా మొత్తం విక్రయాల్లో ఎస్‌యూవీల వాటా 12% ఉండేది. ప్రస్తుతం ఇది 30 శాతానికి పెరిగింద'ని ఆయన వెల్లడించారు.



## కామన్వెల్త్‌లో భారత్‌కు తొలి పతకం

ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ పతకాల ఖాతా తెరిచింది. గ్లాస్గోలో జరిగిన హెవీవెయిట్ పారా పవర్‌లిఫ్టింగ్ ఫైనల్లో భారత పారా అథ్లెట్ ఝుండూ కుమార్ కాంస్య పతకం సాధించి దేశానికి తొలి పతకాన్ని అందించాడు. 190 కిలోల బరువును ఎత్తిన ఝుండూ 130.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. దీంతో కామన్వెల్త్ గేమ్స్ పతకాల పట్టికలో భారత్ బోణీ కొట్టింది. ఫైనల్లో తొలి ప్రయత్నంలో 181 కిలోల బరువును సునాయాసంగా ఎత్తిన ఝుండూ కుమార్, రెండో ప్రయత్నంలో 190 కిలోలను లిఫ్ట్ చేశాడు. ఈ ప్రదర్శనతో కొంతసేపు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకంపై ఆశలు రేకెత్తించాడు. కానీ, చివరి ప్రయత్నంలో 196 కిలోల బరువును ఎత్తేందుకు ప్రయత్నించి విఫలమవడంతో కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే, అంతర్జాతీయ క్రీడోత్సవంలో పోడియంపైకి చేరి భారత జెండాను రెపరెపలాడించిన ఝుండూ ప్రయాణం.. నల్లేరుపై నడకేం కాదు. పుట్టుకతోనే వైకల్యం కాటేసినా.. దాన్ని ఎదిరించి ఇప్పుడు దేశానికి పతకం అందించాడు.

### టీమ్ఇండియా వైఫల్యాలపై..

## వచ్చే నెలలో సమీక్ష : బీసీసీఐ



ప్రస్తుతం జింబాబ్వేతో టీ20 సిరీస్ ఆడుతున్న టీమ్ఇండియా.. వచ్చే నెలలో శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఆగస్టు 15 నుంచి ఆతిథ్య జట్టుతో రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్ కోసం జులై 28న భారత జట్టును ప్రకటిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా వెల్లడించారు. ఐర్లాండ్, ఇంగ్లాండ్, జింబాబ్వే పర్యటనల్లో భారత జట్టు ఆటతీరుపై ఆగస్టు ఆరంభంలో సమీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. టీమ్ఇండియా సహాయక సిబ్బందిలో కొంతమంది కాంట్రాక్టు ముగిసిందని, దానిపై కూడా సమీక్షా సమావేశంలో చర్చిస్తామని సైకియా పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రెండు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్‌కు ఐర్లాండ్ షాకిచ్చిన సంగతి తెలిసిందే. తర్వాత ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లోనూ భారత్ వైట్‌వాష్‌కు గురైన సంగతి తెలిసిందే. ఇంగ్లిష్ జట్టుతో మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్.. తర్వాత రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై సిరీస్‌ను చేజార్చుకుంది. ఈ నేపథ్యంలో భారత జట్టు ప్రదర్శనపై బీసీసీఐ పెద్దలు సమీక్ష నిర్వహించనున్నారు.




### రెండో టీ20లో

# జింబాబ్వే చిత్తు

### టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్



**హరారె:** జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌ను టీమ్ఇండియా 2–0తో కైవసం చేసుకుంది. శనివారం ఏకపక్షంగా సాగిన రెండో టీ20లో భారత్ 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో జింబాబ్వే 17.5 ఓవర్లలో 129 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ బ్రయాన్ బెనెట్ (32) టాప్ స్కోరర్. మరుమాని (24), ర్యాన్ బర్ల్ (20), బ్రాడ్ ఎవాన్స్ (19), డియోన్ మైయర్స్ (12) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అభిషేక్ శర్మ 3, ప్రిన్స్ యాదవ్ 2, యశ్ ఠాకూర్ 2, రవి బిష్ణోయ్, శివమ్ దూబె, తిలక్ వర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు. నామమాత్రపు మూడో టీ20 ఆదివారం జరగనుంది. తొలుత భారత బ్యాటర్లలో ఇషాన్ కిషన్ (81; 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), తిలక్ వర్మ (60; 29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో మెరిశారు. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (20), అభిషేక్ శర్మ (8) పరుగులు చేశారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (25) ఫర్వాలేదనిపించాడు. జింబాబ్వే బౌలర్లలో ముజరబాని, నగరవ, బ్రయాన్ బెన్నెట్, న్యూమన్, బ్రాడ్ ఎవాన్స్ తలో వికెట్ పడగొట్టారు. ఇషాన్ కిషన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో భారత్ సాధించిన తొలి టీ20 సిరీస్ ఇది.

## జోస్ బట్లర్‌కు రోహిత్ శర్మ అదిరిపోయే గిఫ్ట్

ఇంగ్లాండ్ ఆటగాడు జోస్ బట్లర్ కు అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చాడు భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ. ప్రస్తుతం లండన్ లోనే ఉన్న రోహిత్ శర్మ... 45 జెర్సీపై తన ఆటోగ్రాఫ్ చేసి మరి, బట్లర్ కు అందించాడు. ఈ విషయాన్ని స్వయంగా ఇంగ్లాండ్ ఆటగాడు జోస్ బట్లర్ వెల్లడించారు. తన అభిమాన క్రికెటర్ రోహిత్ శర్మ...ప్రత్యర్థి జట్టులో ఉన్నప్పటికీ తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. తాను క్రికెట్ లోకి వచ్చినప్పటి నుంచి రోహిత్ శర్మను ఆరాధిస్తున్నట్లు వెల్లడించారు. అందుకే రోహిత్ శర్మ నుంచి ఈ జెర్సీని గిఫ్ట్ గా తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు బట్లర్. ఇది ఇలా ఉండగా ఇండియా, ఇంగ్లాండ్ మధ్య ఇటీవల 3 వన్డేల సిరీస్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్ సందర్భంగా అద్భుతంగా రాణించిన ఇంగ్లాండ్..2–1 తేడాతో ట్రోఫీని కైవసం చేసుకుంది. చివరి మ్యాచ్ లార్డ్స్ వేదికగా జరగగా రోహిత్ శర్మ సెంచరీ చేశాడు. ఈ సందర్భంగా నే జోస్ బట్లర్ కు ఆటోగ్రాఫ్ పెట్టిన జెర్సీని ఇచ్చినట్లు తెలుస్తోంది.








# మెగా 158లో డాక్టర్ భద్రం కీలక రోల్

## చిరును కలిసి కృతజ్ఞతలు తెలిపిన సోము వీర్రాజు

మెగాస్టార్ చిరంజీవి కొత్త ప్రతిభను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారనే విషయం మరోసారి చర్చనీయాంశమైంది. దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 లో ప్రముఖ హాస్యనటుడు డాక్టర్ భద్రంకు కీలక పాత్ర దక్కడం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్వయంగా చిరంజీవిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ భద్రం తన అల్లుడు కావడంతో, ఆయనకు ఇలాంటి మంచి అవకాశం కల్పించినందుకు చిరంజీవికి వ్యక్తిగతంగా ధన్యవాదాలు తెలిపినట్లు సోము వీర్రాజు వెల్లడించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు, వివరాలను సోషల్ మీడియా ద్వారా పంచుకోవడంతో అవి ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ, కొత్త నటీనటులకు అవకాశాలు కల్పిస్తూ వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంలో చిరంజీవి ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. కళాకారులను ప్రోత్సహించే ఆయన విశాల హృదయం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి?బాబీ కాంబినేషన్‌లో వస్తున్న మెగా158 పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ చిత్రంలో డాక్టర్ భద్రంకు కథలో ప్రాధాన్యం ఉన్న పాత్ర లభించినట్లు సమాచారం. కమెడియన్‌గా ఇప్పటికే మంచి గుర్తింపు సంపాదించిన భద్రం, మెగాస్టార్‌తో కలిసి నటించే అవకాశం తన కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలవనుంది. ముఖ్యంగా 'ప్రతి రోజూ పండగే' చిత్రంలో తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న డాక్టర్ భద్రం, ఇప్పుడు చిరంజీవితో స్క్రీన్ షేర్ చేసుకోనుండటంతో ఆయన పాత్ర ఎలా ఉండబోతుందన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.





# సినిమా ఫలితంతో నా ప్రతిభను అంచనా వేసుకోను : త్రిప్తి దిమ్రి

బాలీవుడ్ భామ త్రిప్తి దిమ్రి తనదైన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ చిత్రం 'యానిమల్'తో దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్నారు. ఈ క్రమంలో స్టార్‌డమ్, హిట్లు, ఫ్లాప్‌ల గురించి త్రిప్తి తాజాగా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "యానిమల్' విజయం నాకు ఎంతో స్వేచ్ఛనిచ్చింది. ఆ సినిమాకి ముందు నాలోని ప్రతిభను నిరూపించుకునే అవకాశాల కోసం నిరంతరం ఎదురుచూసేదాన్ని. ఆ తర్వాత ఇండస్ట్రీలో నాపై నమ్మకం పెరిగింది. ఎన్నో ప్రాజెక్టులు వస్తున్నాయి. ఇప్పుడు కేవలం నిలదొక్కుకోవాలనే భయంతో కాకుండా.. నాకు నచ్చిన కథలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ చిత్ర పరిశ్రమలో దొరికింది. మొదట్లో ఈ స్టార్‌డమ్ కాస్త ఇబ్బందిగా అనిపించినా, తర్వాత అలవాటు పడ్డాను. నేను ఎప్పుడూ నా పనిపైనే పూర్తి దృష్టి పెడతాను. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రాకపోవడం కూడా నాకు కలిసొచ్చింది. ఎందుకంటే.. అది నన్ను ఎప్పుడూ ఒదిగి ఉండేలా చేస్తుంది" అని అన్నారు. ఇక, త్రిప్తి, షాహిద్ కపూర్ జంటగా విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఇటీవల వచ్చిన చిత్రం 'ఓ రోమియో'. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించలేదు. దీనిపై ఆమె స్పందిస్తూ.."కమర్షియల్‌గా సినిమా పరాజయం పాలై ఉండొచ్చు. కానీ, నేను దాన్ని వ్యక్తిగత వైఫల్యంగా భావించను. నటీనటులంతా తమ పాత్రలకు ప్రాణం పెట్టి నటిస్తారు. ప్రేక్షకులు దానికి కనెక్ట్ అవ్వాలని కోరుకుంటారు. కానీ, అన్నిసార్లు అనుకున్నట్లు జరగదు. కొన్నిసార్లు సమయం, అంచనాల వల్ల ఫలితం దక్కుతుంది. కొన్ని చిత్రాలకు ఆలస్యంగా గుర్తింపు వస్తుంది. ఈ సినిమా నాకు ఎన్నో విషయాలు నేర్పించింది. మూవీ ఫలితాన్ని బట్టి మన విలువను, ప్రతిభను అంచనా వేసుకోకూడదనే విషయాన్ని ఈ చిత్రం ద్వారానే నేర్చుకున్నాను. పాత్రకు వంద శాతం న్యాయం చేసి, ఫలితాన్ని వదిలేయాలి " అని పేర్కొన్నారు.

# హాలీవుడ్ సినిమాలకు దీటుగా రామాయణ

## ప్రపంచ నలుమూలలకు వెళ్తుందని ఇన్‌స్టాలో పోస్ట్



నితేశ్ తివారీ దర్శకత్వంలో భారీ హంగులతో రూపుదిద్దుకుంటున్న సినిమా 'రామాయణ'. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. శుక్రవారం విడుదల కావాల్సిన ఈ సినిమా ట్రైలర్ చివరి నిమిషంలో వాయిదా పడింది. అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని భావించి ట్రైలర్‌ని వాయిదా వేస్తున్నాం. హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ' ప్రపంచ నలుమూలలకు వెళ్తుందని పేర్కొంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా అమెరికాలో జరుగుతోన్న శాన్ డియాగో కామిక్-కాన్ 2026 వేడుకల్లో చిత్రబృందం పాల్గొంది. ఈ సందర్భంగా వేడుకలో రణ్‌బీర్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో అవకాశం వచ్చినప్పుడు నాలో చాలా భయం, సందేహం ఉండేవి. 'నేను ఇది చేయగలనా, నాకు అంత సామర్థ్యం ఉందా?' అనిపించేది. కానీ ఆ సందేహం చాలా త్వరగానే కృతజ్ఞతా భావంగా మారింది. ఇదొక వరం. జీవితంలో ఒక్కసారి మాత్రమే లభించే అవకాశం. తరతరాలుగా శ్రీరాముడు ఎంతో మందికి ఆత్మ రక్షకుడిగా ఉన్నారు. ధైర్యం, కరుణ, క్షమ, ధర్మం లాంటి వాటికి ఆయన ప్రతీకగా నిలుస్తారు. అలాంటి లక్షణాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం చాలా గొప్ప విషయం. దీనికి చాలా విశ్వాసం, నమ్మకం, నిజాయతీ అవసరమని ప్రారంభంలోనే అర్థం చేసుకున్నా. ఈ కథను ధ్యమైనంత వాస్తవికంగా చెప్పాలన్నదే మా నటీనటులు, సిబ్బందిల ఉన్నతమైన ఉద్దేశం అన్నారు. యశ్ మాట్లాడుతూ.. 'ఈ ప్రపంచంలో ఎవరూ వచ్చి 'నేను శ్రీరాముడి పాత్ర పోషించగలన'ని చెప్పలేరు. ఈ పాత్ర పోషించడం అంత సులభం కాదు. రణ్‌బీర్ గొప్పగా నటించారు. సినిమా చూసినప్పుడు అతని నిబద్ధత కనిపిస్తుంద'ని అన్నారు. రెండు భాగాలుగా విడుదల అవనున్న ఈ సినిమా మొదటి భాగం దీపావళికి థియేటర్లలోకి రానుంది.





# సక్సెస్ టాక్‌లో చెన్నై లవ్ స్టోరీ

టాలీవుడ్‌లో తాజాగా విడుదలైన ప్రేమకథా చిత్రాల్లో 'చెన్నై లవ్ స్టోరీ' ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, నటి శ్రీ గౌరీ ప్రియా జంటగా నటించిన ఈ చిత్రానికి దర్శకుడు రవి నంబూరి దర్శకత్వం వహించారు. జాతీయ అవార్డు గ్రహీత సాయి రాజేష్ అందించిన కథతో తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు ముందే మంచి అంచనాలు ఏర్పరుచుకోగా, ప్రీమియర్ షోల నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ను అందుకుంది. ముఖ్యంగా కిరణ్ అబ్బవరం నటన, శ్రీ గౌరీ ప్రియా సహజమైన అభినయం, భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని సినీ అభిమానులు సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో విడుదలైన మొదటి రోజే 1.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడుపోవడం విశేషంగా మారింది. విడుదల రోజునే ఇంత భారీ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం సినిమా క్రేజ్‌ను ప్రతిబింబిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, నేపథ్య సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. భావోద్వేగ సన్నివేశాలను మరింత బలంగా నిలబెట్టడంలో ఆయన సంగీతం కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. తొలి రోజు స్పందనను బట్టి చూస్తే, 'చెన్నై లవ్ స్టోరీ' కిరణ్ అబ్బవరం కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'చెన్నై లవ్ స్టోరీ' చిత్ర బృందం నిర్వహించిన సక్సెస్ మీట్ లో సిబ్బంది మాటలు హైలైట్‌గా నిలిచాయి. హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ, నిర్మాతలు ధీరజ్ మొగిల్నేని, ఎస్‌కేఎన్ తమ అనుభవాలను పంచుకుంటూ సినిమాపై ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ మాట్లాడుతూ.. తన జీవితంలో ఇది ఎంతో ప్రత్యేకమైన విజయమని చెప్పారు. సినిమా విడుదలైనప్పటి నుంచి తన ఫోన్ నిరంతరం మోగుతూనే ఉందని, చాలామంది మీ అమ్మ ఉండి ఉంటే చాలా సంతోషించేదని చెబుతున్నారని వెల్లడించారు. అయితే తన అమ్మ ఎక్కడ ఉన్నా తన విజయాన్ని చూస్తూనే ఉంటుందని తాను నమ్ముతున్నానని ఆమె ఎమోషన్ అయ్యారు. ఒక తెలుగు అమ్మాయిగా కంటెంట్ ఉన్న పాత్రలో నటించే అవకాశం రావడం తన అదృష్టమని అన్నారు. నిర్మాత ధీరజ్ మొగిల్నేని మాట్లాడుతూ.. సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రాణం పోశాయని చెప్పారు.



# సౌండ్ ఇంజనీర్‌గా వస్తోన్న నారా రోహిత్

కథానాయకుడు నారా రోహిత్ జోరుమీదున్నారు. ఒకప్పుడు వైవిధ్యమైన కథలు, పాత్రలు ఎంచుకుని అలరించేవారు. ఆయన నుంచి సినిమా వస్తుందంటే ఏదో కొత్తదనం ఉందనే భావన ప్రేక్షకులకు కలిగేది. అయితే, కొంత కాలం విరామం తీసుకున్న నారా రోహిత్ గతేడాది 'భైరవం', 'సుందరకాండ' చిత్రాలతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఇప్పుడు మరోసారి వరుస చిత్రాలతో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాల కబుర్లు పంచుకుంటున్నారు. రామ్ గన్నీ దర్శకత్వంలో రోహిత్ ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి 'కపాలి' అనే టైటిల్, ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. పురాణాంశాలతో నిండిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇక వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం. 47'లోనూ నారా రోహిత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ లుక్‌ను కూడా చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ శనివారం సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. దీంతో పాటు, చినిమిల్లి మణి కుమార్ దర్శకత్వంలో ఓ వైవిధ్యమైన కథలో నారా రోహిత్ మెరవనున్నారు. ఈ సినిమాకు 'సౌండ్ ఇంజనీర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. నయన్‌సారిక, నరేశ్, రోహిణి, అజయ్, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# అర్థవంతమైన పాత్రలుంటేనే చేస్తా : నిధి అగర్వాల్

సినిమాల్లో అవకాశాల కోసం తొందరపడడం లేదని నటి నిధి అగర్వాల్ అన్నారు. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' తర్వాత తమిళ సినిమా చేయలేదని, సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. మంచి దర్శకులతో అర్థవంతమైన పాత్రలు ఉన్న సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాంటి పాత్రలకు తమిళ ఇండస్ట్రీ సరైన చోటు. నా జీవితంలో దేనికీ నేను తొందరపడను. పెళ్లి విషయంలో కూడా అంతే. మంచి ప్రాజెక్ట్‌లు వస్తే.. సినిమాలు చేస్తాను. 'హరి హర వీరమల్లు, 'ది రాజా సాబ్' సినిమాల్లో స్టార్‌లతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం తెలుగు, హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాను. దీంతో తమిళంలో నటించడం మిస్ అవుతున్నా. నాది చాలా సున్నితమైన మనస్తత్వం. అందుకే భావోద్వేగాలు ఎక్కువగా బయటపెట్టను. వృత్తిపరంగా బాగా కష్టపడతాను. ఇతర విషయాలకొస్తే అత్యంత సోమరిని. ప్రస్తుతం రెండు ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇంకా ఫైనల్ చేయలేదని నిధి తెలిపారు. ఇక, ప్రస్తుతం ఆమె 'మిరాయ్' పార్ట్-2, హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్'లో కనిపించనున్నారు.

Edited,Printed, Published and Owned by DHANDYALA RAVI KUMAR, Printed at Gayathri Printers - ID : PRESS/2025/125/00007278, Address : Plot no: 69 to 75, 4th Line, IDA, Khanapuram, Khammam - 507002.Telangana. EDITOR: DHANDYALA RAVI KUMAR. RNI NO: APTEL/2008/26868. Ph: 9848156178, mail: organ.today@gmail.com , website : www.organnews.in